## శరణాగతి.. గరుడా చలపతి


స్నపన తిరుమంజనం

వాడపల్లి(ఆత్రేయపురం), న్యూస్‌టుడే: వాడపల్లి శ్రీవేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం గరుడోత్సవం కనులపండువగా జరిగింది. మలయప్పస్వామి మకరకంఠి, లక్ష్మీహారం వంటి విశేష ఆభరణాలు ధరించి గరుత్మంతుడిపై భక్తులకు ఆశీస్సులు అందించారు. జ్ఞాన వైరాగ్య ప్రాప్తి కోరే మానవులు గరుడిని దర్శిస్తే సర్వపాపాలు తొలగుతాయంటూ భక్తకోటికి పండితులు సందేశాన్నిచ్చారు. తొలుత నదీజలాల సంగ్రహణం, మహాస్నపనం, లక్ష కుంకుమార్చన, మహాలక్ష్మీ హోమం తదితర కార్యక్రమాలను అర్చకులు నిర్వహించారు.


శుక్రవారం రాత్రి శ్రీవారి గరుడ వాహన సేవ

● శనివారం మహాపుష్పయోగం, సూర్య చంద్రప్రభ వాహన సేవ, సహస్ర దీపాలంకరణ సేవ ఉంటాయి.

## గేటువేస్తే పట్టాలు దాటొద్దు

సాంబమూర్తినగర్: రైల్వే గేటు వేసినపుడు పట్టాలను ఎట్టి పరిస్థితుల్లోనూ దాటొద్దని కాకినాడ టౌన్ రైల్వే రక్షణ దళం (ఆర్పీఎఫ్) సీఐ వై.కొండయ్య సూచించారు. శుక్రవారం అచ్యుతాపురం రైల్వేగేటు వద్ద ప్రయాణికులకు ఆయన అవగాహన కల్పించారు. రైల్ల రాకపోకల సమయాల్లో గేటు వేస్తారని, గేటుకు దగ్గరగా రావడం, గేటును తాకడం, వాహనాలతో కింద నుంచి వెళ్లడం చేయరాదన్నారు. ఏఎస్ఐ శివశంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

## చిన్న పరిశ్రమలకు పెద్ద వేదిక

### రూ.13 కోట్లతో పారిశ్రామిక సముదాయం

ఈనాడు, కాకినాడ: సూక్ష్మ- చిన్న- మధ్యతరహా పరిశ్రమలను ప్రోత్సహించే క్రమంలో కేంద్ర ప్రభుత్వం ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ సముదాయాల (ఎఫ్‌ఎఫ్‌సీ) నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్రానికి నాలుగు మంజూరు చేయగా అందులో ఒకటి కాకినాడ జిల్లాకు కేటాయించారు. కేంద్ర- రాష్ట్ర ప్రభుత్వ నిధులు రూ.13.30 కోట్లతో పెద్దాపురంలోని పారిశ్రామిక వాడలో పనులు ఇటీవల ప్రారంభమయ్యాయి. 2.24 ఎకరాల్లో జీ ప్లస్2లో ఫ్యాక్టరీ సముదాయ నిర్మాణ బాధ్యతలను హైదరాబాద్‌కు చెందిన శివరామ కంపెనీకి ప్రభుత్వం అప్పగించింది. తొమ్మిది నెలల్లో పనులు పూర్తిచేయాలన్న షరతు విధించింది. కేంద్ర ప్రభుత్వం 70 శాతం నిధులు రూ.9.31 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం నిధులు రూ.3.99 కోట్లు వెచ్చించి నిర్మించనున్న ఈ భవనంలో 26 సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పారిశ్రామిక యూనిట్లు (ఎంఎస్‌ఎంఈ)కు ప్లాట్లు అందుబాటులోకి వస్తాయి.

#### ఔత్సాహికులకు ప్రోత్సాహం

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించి.. తయారీ రంగానికి ఊతమివ్వాలనేది ఎఫ్‌ఎఫ్‌సీ ఉద్దేశం. గతంలో ఎంఎస్‌ఎంఈలకు స్థలాలు కేటాయిస్తే.. అక్కడ భవనాలు నిర్మించుకుని కార్యకలాపాలు సాగించేవారు. ఇందుకు వ్యయప్రయాసలు పడాల్సి వచ్చేది. ఇప్పుడు ప్రభుత్వమే బహుళ అంతస్తుల భవనం నిర్మించి నేరుగా గదులు కేటాయించనుంది. భవిష్యత్తులో నేరుగా కార్యకలాపాలు ప్రారంభించే వెసులుబాటు దక్కనుందని ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ ఎ.రమణారెడ్డి తెలిపారు.


పెద్దాపురంలో చేపట్టిన నిర్మాణ పనులు

#### సకల వసతులతో..

ఎఫ్‌ఎఫ్‌సీ నిర్మాణానికి అనువైన స్థలం పెద్దాపురంలో ఉండడంతో ఇటీవల జీప్లస్ 2 భవన నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ 1,360 చ.మీలలో చేపడతారు. మిగిలిన ప్రాంగణాన్ని రహదారులు, పార్కింగ్, పచ్చదనం, ప్రహరీ, విద్యుదీకరణతో పాటు భవిష్యత్తు విస్తరణ అవసరాలకు విడిచిపెట్టారు.

● గ్రౌండ్ ఫ్లోర్‌లో ఏడు హాళ్లు ఉంటాయి. ఇక్కడ పరిపాలన విభాగం, బ్యాంకు, తపాలా కార్యాలయం, ముడిసరకు నిల్వ కేంద్రం, ప్రథమ చికిత్స కేంద్రం, డాక్యుమెంటేషన్ సెంటర్, క్యాంటీన్ వస్తాయి.

● మొదటి అంతస్తులో 9 హాళ్లు నిర్మిస్తారు. ఇక్కడ టెలీ కమ్యూనికేషన్ సెంటర్, కాన్ఫరెన్స్ హాలు, పోషణ కేంద్రం (క్రీచ్), సైబర్ సెంటర్ ఉంటాయి.

● రెండో అంతస్తులో.. 10 హాళ్ల నిర్మాణానికి ప్రణాళిక సిద్ధంచేశారు. ఇక్కడ ప్రదర్శన శాల, ఫ్లోరో ఫ్లోరో కార్బన్స్ (సీఎఫ్‌సీ- 1, 2 క్యాబిన్లు ఏర్పాటుచేయనున్నారు.

## వైకాపా పాలనలో ఇష్టారాజ్యంగా ఇసుక దోపిడీ

### రూ. వేల కోట్లు లూటీ చేశారు: మంత్రి నిమ్మల


వాడపల్లి ఇసుక ర్యాంపు నిర్వహణపై అధికారులను అడిగి తెలుసుకుంటున్న మంత్రి రామానాయుడు

చాగల్లు, న్యూస్‌టుడే: అయిదేళ్ల వైకాపా పాలనలో ఇష్టారాజ్యంగా ఇసుక దోపిడీకి పాల్పడ్డారని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ధ్వజమెత్తారు. తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు మండలంలోని వాడపల్లి ఇసుక రీచ్‌ను శుక్రవారం సాయంత్రం ఆకస్మిక తనిఖీ చేశారు. రీచ్ నిర్వహణ, ప్రభుత్వ ఆదేశాల అమలు, తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వం జేపీ వెంచర్స్ పేరిట సుమారు రూ.30 వేల కోట్ల నుంచి రూ. 40 వేల కోట్ల విలువైన ఇసుక లూటీకి పాల్పడిందన్నారు. దీంతో ప్రకృతి సంరక్షణను దృష్టిలో పెట్టుకొని రాష్ట్రంలో అన్ని రీచ్‌లను ప్రారంభించేందుకు జాతీయ హరిత ట్రైబ్యునల్, కాలుష్య నియంత్రణ బోర్డు అనుమతులు ఇవ్వడం లేదన్నారు. ఎన్డీయే ప్రభుత్వం సహజసిద్ధంగా లభించే ఇసుక ఉచితంగా ప్రజలకు చేరాలనే ఆశయంతో ముందుకెళుతోందన్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలోనూ సరఫరా చేసి డిమాండ్‌ను తగ్గించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. వరద తగ్గిన వెంటనే ఓపెన్ రీచ్‌లను వినియోగంలోకి తీసుకొస్తామన్నారు.

## నూనె సలసల

### ప్రత్యేక కౌంటర్లలోనూ కానరాని వైనం

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: నిత్యావసరాల ధరల నియంత్రణలో భాగంగా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో కాకినాడ జిల్లాలో ఏర్పాటుచేసిన ప్రత్యేక కౌంటర్లలో వంట నూనెలకు కొరత ఏర్పడింది. ఈనెల 10న తుని, కత్తిపూడి, పెద్దాపురం, పిఠాపురం, కాకినాడ, సామర్లకోట ప్రాంతాల్లో బియ్యం, టమోటా, ఉల్లిపాయలు, వంట నూనెలు తక్కువ ధరలకు విక్రయించేలా రైతుబజార్లు, మాల్స్‌లో 18 ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటుచేశారు. ఉల్లిపాయలు, టమోటా ధరలు నియంత్రణలో ఉన్నా.. వంట నూనెల ధరలు బహిరంగ మార్కెట్‌లో చుక్కలు చూపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రేషన్‌కార్డుకు మూడు లీటర్ల పామాయిల్(లీటరు రూ.110), ఒక లీటరు సన్‌ఫ్లవర్(లీటరు రూ.124) చొప్పున కౌంటర్లలో విక్రయాలు చేపట్టారు. ఈనెల 17 వరకు సరకు అందుబాటులో ఉన్నా.. తరువాత కొరత ఏర్పడింది. ఇప్పటికి 1,854 పామాయిల్ లీటరు ప్యాకెట్లు, 1,174 సన్‌ఫ్లవర్ లీటరు ప్యాకెట్లు నిర్దేశించిన ధరకు విక్రయించారు. కొన్నిరోజులుగా సరఫరా నిలిచిపోవడంతో కౌంటర్ల వద్ద ప్రజలకు అందుబాటులో లేకుండా పోయాయి. వంటనూనెల తయారీ పరిశ్రమల నుంచి నిర్దేశిత ధరలకు సరకు ఇవ్వడానికి యాజమాన్యాలు నిరాకరిస్తున్నాయి. దీనిపై జిల్లాస్థాయిలో ప్రత్యేక చొరవ తీసుకోవడంలేదనే విమర్శలు ఉన్నాయి.


గాంధీనగర్ రైతుబజారులో ప్రత్యేక కౌంటరు

#### పర్యవేక్షణ కొరవడి..

టోకు వ్యాపారులు, వంటనూనెల కంపెనీల ప్రతినిధులతో జిల్లాస్థాయిలో అత్యవసర సమావేశం నిర్వహించి పరిస్థితిని చక్కదిద్దాల్సిన అవసరం ఉంది. ఈ కౌంటర్లపై పర్యవేక్షణ కొరవడింది. వీటి వద్ద సరకులు పొందడానికి క్యూఆర్ కోడ్ విధానంతో అవస్థ నెలకొంది. కొంత మందికి స్మార్ట్‌ఫోన్లు లేకపోవడం, ఓటీపీతో ఇబ్బంది వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. నెలకు ఒక కుటుంబానికి 3 పామాయిల్ లీటరు ప్యాకెట్లు, ఒక సన్‌ఫ్లవర్ ప్యాకెట్ చొప్పున సరఫరా చేయాలన్నది రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం. ఇదంతా బాగానే ఉన్నా.. సరకు లేకపోవడం చిక్కుతెచ్చిపెట్టింది. దీనిపై జిల్లా పౌరసరఫరాల అధికారి ఎంవీ ప్రసాద్ వద్ద ప్రస్తావించగా కంపెనీల యాజమాన్యాలు, టోకు వ్యాపారులతో సంప్రదింపులు చేస్తున్నామన్నారు. త్వరగా సరకు వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రత్యేక కౌంటర్లలో యథావిధిగా వంట నూనెలు విక్రయాలు చేస్తామన్నారు.

## ఆధ్యాత్మిక యాత్రకు శ్రీకారం

### నేటినుంచి పర్యాటక శాఖ ఆధ్వర్యంలో క్షేత్రాల సందర్శన

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: రాష్ట్ర పర్యాటక శాఖ నిర్వహణలో ఒక రోజు ఆధ్యాత్మిక యాత్ర శనివారం నుంచి ప్రారంభిస్తున్నట్లు ఆ శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. రాజమహేంద్రవరం సరస్వతీఘాట్‌లోని పర్యాటకశాఖ కార్యాలయం నుంచి శనివారం ఉదయం 6 గంటలకు యాత్ర మొదలవుతుంది. తొలుత కోరుకొండ శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో స్వామివారిని భక్తులు దర్శించుకుంటారు. అక్కడ్నుంచి అన్నవరం సత్యనారాయణస్వామి, పిఠాపురం కుక్కుటేశ్వర స్వామి, సామర్లకోట కుమారరామ భీమేశ్వరస్వామి, ద్రాక్షారామ భీమేశ్వరస్వామి, వాడపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయాల సందర్శన ఉంటుంది. అనంతరం రాజమహేంద్రవరం పుష్కరఘాట్ వద్ద గోదారమ్మ నిత్యహారతి తిలకించడంతో ముగుస్తుంది. వాహనంలో 18 మంది భక్తులు ప్రయాణించవచ్చు. ప్రతి శనివారం ఈ యాత్ర ఉంటుంది.

| టికెట్ ధర(రూ.లలో) |
| --- |
| పెద్దలకు : 1000 |
| పిల్లలకు(3 నుంచి 10ఏళ్ల లోపు) : 800 |
| వివరాలకు నంబర్లు: 98486 29341 98488 83091 |


పిఠాపురంలోని పాదగయ క్షేత్రం

#### అదిగో పాపికొండల విహారం

గోదావరి వరదల నేపథ్యంలో జులై 13 నుంచి నిలిచిపోయిన పాపికొండల విహార యాత్రకు తిరిగి శనివారం నుంచి శ్రీకారం చుట్టారు. గండిపోచమ్మ బోటింగ్ పాయింట్ నుంచి దీనిని ప్రారంభిస్తున్నామని పర్యాటకశాఖ డివిజనల్ మేనేజర్ సీహెచ్ పవన్ కుమార్ తెలిపారు. మాక్ డ్రిల్‌లో భాగంగా వివిధ శాఖల అధికారులతో శుక్రవారం మూడు బోట్లలో వెళ్లి పరిశీలించామన్నారు. గండిపోచమ్మ పాయింట్ నుంచి 40 మంది పర్యాటకులు, నలుగురు సిబ్బంది ప్రయాణించేందుకు వీలుగా సర్ ఆర్థర్ కాటన్

| టికెట్ రుసుము (రూ.లలో) |
| --- |
| రాజమహేంద్రవరం నుంచి: |
| పెద్దలకు-1,250 |
| పిల్లలకు(పదేళ్లలోపు) : 1000 |
| గండిపోచమ్మ బోటింగ్ నుంచి: |
| పెద్దలకు -1000 |
| పిల్లలకు(పదేళ్లలోపు)- 750 |
| సంప్రదించాల్సిన ఫోన్ నం: 98486 29341 |


దేవీపట్నం వద్ద పర్యాటకబోటుపై పరిశీలన

పర్యాటక శాఖ బోటు, 14 ప్రైవేటు బోట్లు శనివారం నుంచి అందుబాటులో ఉంటయి.

యాత్ర సాగేదిలా.. రాజమహేంద్రవరం ఏపీ పర్యాటక శాఖ కార్యాలయం నుంచి ఉదయం 7.30 గంటలకు వాహనంలో బయలుదేరి గండిపోచమ్మ బోటు పాయింట్‌కు చేరుకుంటారు. అక్కడినుంచి 9.30 గంటలకు యాత్ర మొదలై సాయంత్రం 5.30 గంటలకు మళ్లీ గండిపోచమ్మ పాయింట్‌కు చేరుకుంటుంది. వాహనంలో బయలుదేరి సాయంత్రం 7.30 గంటలకు రాజమహేంద్రవరం చేరుకోవడంతో ముగుస్తుంది.

## ఆ రోజు ఏం జరిగింది..?

### జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో అనిశా అధికారుల విచారణ

గాంధీనగర్, న్యూస్‌టుడే: కాకినాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అవినీతి, అధిక వసూళ్లు ఎక్కువగా ఉన్నాయనే ఆరోపణలతో 2020 జనవరి 10న ఏసీబీ అధికారులు ఆకస్మికంగా దాడి చేశారు.. ఆ రోజు ఏం జరిగింది.. పరిమితికి మించి లేఖర్ల వద్ద నగదు ఎందుకు ఉంది..? ఆ నగదు ఎవరికి సంబంధించినది..? అని విచారణ అధికారులు ప్రశ్నలు గుప్పించారు. శాఖాపరమైన విచారణలో భాగంగా శుక్రవారం కాకినాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అప్పటి సబ్ రిజిస్ట్రార్-1, 2గా పనిచేసిన కె.వి.ఎస్.కుమారి, శేఖర్‌బాబులతో పాటు పలువురు లేఖర్ల నుంచి విచారణ అధికారులు వివరాలు ఆరా తీశారు. అప్పట్లో సబ్ రిజిస్ట్రార్ల వద్ద నగదు లేకపోయినా కార్యాలయంలోని దాదాపు ఏడుగురు లేఖర్ల వద్ద రూ.16 వేల వరకు నగదు దొరికింది. పరిమితికి మించి నగదు ఉండడంతో అప్పట్లో కేసు నమోదుచేసి విచారణ ప్రారంభించారు. దీనిలో భాగంగా మళ్లీ శుక్రవారం శాఖాపరమైన విచారణ చేపట్టారు. అప్పటి రాజమహేంద్రవరం జిల్లా రిజిస్ట్రార్‌గా పనిచేసిన కె.ఆనందరావు, అనిశా సీఐ వాసుకృష్ణ విచ్చేసి కేసు పూర్వాపరాలపై ఆరా తీయడంతో పాటు విచారణ చేశారు. అనిశా దాడుల నేపథ్యంలో అప్పటి సబ్ రిజిస్ట్రార్లతో పాటు లేఖర్లను కూడా కార్యాలయానికి పిలిపించారు. ఆ రోజు కార్యాలయంలో ఏం జరిగిందని పలు ప్రశ్నలు సంధించినట్లు తెలిసింది. వారిచ్చిన సమాచారాన్ని నమోదు చేసుకున్నారు. త్వరలోనే మరోసారి కేసుపై పూర్తి విచారణ చేసి నివేదికను ఉన్నతాధికారులకు అందించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.


కుమారి, శేఖర్‌బాబులతో మాట్లాడుతున్న అనిశా సీఐ వాసుకృష్ణ, జిల్లా రిజిస్ట్రార్ ఆనందరావు

#### సుదీర్ఘ కాలం తర్వాత..

అప్పట్లో కేసు నమోదుచేసినా విచారణ నత్తనడకన సాగింది. వైకాపా హయాం ముగిసి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గత ప్రభుత్వంలో నమోదైన ఏసీబీ కేసులు, అవినీతి అధికారుల చిట్టాను వెలికితీసే పనిలో ప్రస్తుత అధికారులు పడ్డారు. ఈ క్రమంలోనే సుదీర్ఘకాలం తరవాత కేసు విచారణ ప్రారంభించినట్లు సమాచారం.

## సవాళ్లకు అనుగుణంగా పోలీసు వ్యవస్థ నవీకరణ

### ఏలూరు రేంజ్ ఐజీపీ జీవీజీ అశోక్‌కుమార్


ప్రత్తిపాడు స్టేషన్‌లో ఐజీపీ అశోక్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు, చిత్రంలో ఎస్పీ విక్రాంత్ పాటిల్

ప్రత్తిపాడు: సవాళ్లకు అనుగుణంగా పోలీసు వ్యవస్థను నవీకరించుకుంటున్నట్లు ఏలూరు రేంజి ఐజీపీ జీవీజీ అశోక్‌కుమార్ స్పష్టం చేశారు. ప్రత్తిపాడు సర్కిల్ పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఐజీపీ మాట్లాడుతూ.. సాంకేతిక వనరులను నేరాల నియంత్రణకు పూర్తిస్థాయిలో వినియోగించుకుంటామన్నారు. నేరస్థులకు సంబంధించి వేలిముద్రలతో సహా సమగ్ర వివరాలు సాఫ్ట్‌వేర్‌లో పొందుపరుస్తున్నామన్నారు. కుటుంబ కలహాలతో పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయిస్తున్న తీరు పెరుగుతున్న దృష్ట్యా కౌన్సిలింగ్ సెంటర్లను అందుబాటులో ఉంచుతామని ఐజీపీ తెలిపారు. మహిళలు, పిల్లల పట్ల జరిగే నేరాలకు అడ్డుకట్ట వేసేందుకు పటిష్ఠమైన చర్యలు తీసుకున్నామన్నారు. ఈవ్‌టీజింగ్ ఇతరత్రా అసాంఘిక కార్యకలాపాలకు తావు లేకుండా ప్రతి స్టేషన్ పరిధిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్న దృష్ట్యా బ్లాక్‌స్పాట్ల వద్ద, రహదారి భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. ప్రత్తిపాడు సర్కిల్‌తో సహా పలుచోట్ల భూతగాదాలు, కుటుంబ కలహాలు, ఆత్మహత్యల కేసులు నమోదవుతున్నాయని సామాజిక పరివర్తనతోనూ వీటిని అదుపుచేస్తామని ఐజీపీ అశోక్‌కుమార్ స్పష్టంచేశారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్‌తో కలిసి విచ్చేసిన ఆయనకు పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు, సీఐ సూర్య అప్పారావు, ఎస్సై లక్ష్మీకాంతం ఐజీపీకి స్వాగతం పలికారు. అనంతరం పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. నమోదైన కేసుల వివరాలు పరిశీలించారు. అంతకుముందు తుని గ్రామీణ సర్కిల్ కార్యాలయాన్ని సందర్శించారు.



## రైల్వేస్టేషన్ల అభివృద్ధికి కేంద్రం అంగీకారం: ఎంపీ

కాకినాడ కలెక్టరేట్: కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని రైల్వే స్టేషన్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అంగీకారం తెలిపిందని ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చొరవతో కేంద్ర మంత్రివర్గం ఈ మేరకు నిర్ణయం తీసుకుందని వివరించారు. కాకినాడ, తుని, సామర్లకోట రైల్వేస్టేషన్లను అత్యాధునిక హంగులతో అభివృద్ధి చేస్తారని తెలిపారు. త్వరలోనే టెండర్లు ఆహ్వానిస్తామన్నారు. రాజధాని అమరావతికి కొత్త రైల్వే లైను మంజూరు చేయడం శుభపరిణామన్నారు. మరో 57 కి.మీ. కొత్త రైల్వే లైను నిర్మాణంతో రాష్ట్రంలో ప్రధాన పోర్టులకు అనుసంధానం చేయనున్నారని పేర్కొన్నారు. ఆయా పనులతో రాజధాని శరవేగంగా అభివృద్ధి చెందుతుందని, పారిశ్రామిక అభివృద్ధికి దోహదపడుతుందన్నారు.



నిర్మాణ దశలో రిలయన్స్ బయో ఎనర్జీ ప్లాంటు

## పెద్దాపురంలో రిలయన్స్ బయో ఎనర్జీ కాంప్లెక్సులు

### వచ్చే ఏడాది అందుబాటులోకి మూడు యూనిట్లు

**ఈనాడు, కాకినాడ:** కాకినాడ జిల్లా పెద్దాపురంలోని పారిశ్రామిక వాడలో రిలయన్స్ బయో ఎనర్జీ లిమిటెడ్ ఆధ్వర్యంలో మూడు బయో ఎనర్జీ కాంప్లెక్సుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కే-1, కే-2, కే-3 పేరిట ఒక్కో ప్లాంటును రోజుకు 22.51 టన్నుల బయో గ్యాస్ ఉత్పత్తి సామర్థ్యంతో నిర్మిస్తున్నారు. దీని కోసం ఒక్కో ప్లాంటుకు రూ.116 కోట్ల చొప్పున వెచ్చిస్తున్నారు. వ్యవసాయ ఆధారిత ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వ్యవసాయ, పశు, మున్సిపల్ వ్యర్థాల ద్వారా ఈ ప్లాంటుల నిర్వహణకు ప్రణాళికలు సిద్ధం చేశారు. వరి, జొన్న, చెరకు, నివాసాల వ్యర్థాలు, కూరగాయలు, పండ్లు, పూల వ్యర్థాలను చిన్నచిన్న ముక్కలుగా కట్ చేసి, శుద్ధిచేసి ఈ ప్లాంట్ల ద్వారా బయో గ్యాస్ ఉత్పత్తి చేస్తారు. వ్యర్థాల సేకరణకు మార్కెటింగ్ వ్యవస్థను రిలయన్స్ సంస్థ సిద్ధం చేసింది. ప్లాంట్ల నిర్వహణ ద్వారా వెలువడే వ్యర్థాలను పంట పొలాలకు ఎరువుల కింద వినియోగించుకోవచ్చు. ఇప్పటికే ఉత్తర్‌ప్రదేశ్‌లో ఇలా రెండు వేల ఎకరాలకు ఎరువుగా వ్యర్థాలు అందిస్తున్నట్లు ఏపీ-తెలంగాణ ప్రాంతీయ హెడ్ కృష్ణ కుమార్ తెలిపారు. కే-1 యూనిట్ వచ్చే ఏడాది మొదటి 3 నెలల్లో, కే-2 ఏప్రిల్ నాటికి, కే-3 మే నాటికి అందుబాటులోకి రానున్నట్లు తెలిపారు. ప్రస్తుతం కే-1 కాంప్లెక్సు పనులు ప్రారంభమయ్యాయి. ఒక్కో యూనిట్ ద్వారా 70 మందికి ప్రత్యక్షంగా, 200 మందికి పరోక్షంగా ఉపాధి దొరుకుతుందని చెబుతున్నారు.



కాంప్లెక్స్-I ముఖద్వారం

## పశు గణనకు శ్రీకారం

**కాకినాడ కలెక్టరేట్:** జిల్లాలో పశు గణనకు శుక్రవారం శ్రీకారం చుట్టారు. కలెక్టర్ షాన్‌మోహన్ విడిది కార్యాలయంలో ఈ ప్రక్రియను ప్రారంభించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు గణన కొనసాగుతుందన్నారు. ప్రతీ ఇంటికి వెళ్లి జీవుల లెక్క చేపట్టాలన్నారు. వికసిత్ ఆంధ్ర రూపకల్పనకు ఇది ఎంతగానో ఉపయోపడుతుందన్నారు. గేదెలు, ఆవులు, గొర్రెలు, మేకలు, పందులు, గుర్రాలు, గాడిదలు, ఒంటెలు, ఏనుగులు, శునకాలు, కుందేళ్లు, పక్షిజాతులైన కోళ్లు, బాతులు, టర్కీకోళ్లు ఇతర పెంపుడు జంతువుల సంఖ్య లెక్కిస్తారని తెలిపారు. ఈ అంశంపై పాడి రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. అనంతరం కలెక్టర్ బంగ్లాలో అవగాహన గోడపత్రికలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ జేడీ ఎస్.సూర్యప్రకాశరావు, డీడీ కె.కృష్ణమూర్తి, ఏడీలు ఎన్.నిర్మల, ఎం.దినకర్, పశుగణన జిల్లా నోడల్ అధికారి జి.గిరీష్ పాల్గొన్నారు.

# పదేళ్లు.. ఆగని కన్నీళ్లు

- వాకతిప్పలో 2014లో బాణసంచా పేలి 18 మంది మృతి
- బాధిత కుటుంబాలను ఆదుకోని వైకాపా సర్కారు

న్యూస్‌టుడే, కొత్తపల్లి, పిఠాపురం

● కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలంలోని వాకతిప్పలో 2014 అక్టోబరు 20న ఓ బాణసంచా కేంద్రంలో పేలుడు సంభవించి 18 మంది ప్రాణాలు కోల్పోయారు. తయారీ కేంద్రానికి అనుమతులున్నా నియమ నిబంధనలు పాటించకపోవడంతో ప్రమాదం చోటుచేసుకుంది. బాధిత కుటుంబాలు ప్రభుత్వ ప్రోత్సాహం కోసం ఎదురుచూస్తున్నారు.

● కోనసీమ జిల్లా అమలాపురం పట్టణ పరిధిలో ఈ ఏడాది సెప్టెంబరు 16న బాణసంచా కేంద్రంలో పేలుడు చోటుచేసుకుంది. ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. సమీపంలోని రెండు గృహాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఈ కేంద్రం నిర్వహణకు ఎలాంటి అనుమతులు లేవు. ఇప్పటికీ అధికారుల చర్యలు శూన్యం.

### అది మరిచిపోలేని రోజు

దీపావళి పండగ నేపథ్యంలో బాణసంచా తయారీ కేంద్రంలో మహిళలు తీరిక లేకుండా పనిచేస్తున్న సమయంలో ఒక్కసారిగా పేలుడు సంభవించింది. ఏం జరిగిందో తెలిసేలోపే వారంతా ప్రాణాలు కోల్పోయారు. అందరి కుటుంబాల్లో వెలుగులు పూయించిన దీపావళి, బాధిత 18 కుటుంబాల్లో చీకటి నింపింది. ఒకే ఇంటిలో ఇద్దరు ముగ్గురు చనిపోయిన కుటుంబాలు కూడా ఉన్నాయి. అనుమతులున్నా నియమ, నిబంధనలు సరిగా పాటించని నిర్వాహకుల నిర్లక్ష్యం, తక్కువ స్థలంలో ఎక్కువ మొత్తంలో పేలుడు సామగ్రి నిల్వచేయడమే ప్రమాదానికి కారణమైంది. ఈ ఘటన తర్వాత కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లో పలుచోట్ల ఇలాంటి ప్రమాదాలే చోటుచేసుకున్నాయి.



వాకతిప్ప ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కూలీలు

### పరిహారం ప్రకటన ఇలా..

వాకతిప్ప బాణసంచా పేలుడు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన బాధిత కుటుంబాలకు అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రూ.2 లక్షల నగదు, అరెకరా పొలం చొప్పున పరిహారంగా ప్రకటించారు. నగదు బాధిత కుటుంబాలకు అందింది. పరిహార భూమి మాత్రం రెవెన్యూ అధికారులు మూలపేటరోడ్డులో కేటాయించారు. 9 ఎకరాల భూమిని 18 కుటుంబాలకు చూపించారు.

### పోరాడినా పట్టించుకోని గత ప్రభుత్వం

తమకు భూమి అప్పగించి, పట్టాదారు పాస్ పుస్తకాలు ఇప్పించాలని గత ఐదేళ్లలో వైకాపా ప్రభుత్వ పెద్దలను కోరినా, న్యాయం జరగలేదని బాధిత కుటుంబాలవారు వాపోతున్నారు. బాధితులు ప్రభుత్వ కార్యాలయాలు, పాలకులు, అధికారుల చుట్టూ తిరుగుతూ.. ధర్నాలు, దీక్షలు, ఆందోళనలు చేసి అలసిపోయారు. పాస్ పుస్తకాలు లేకపోవడం వల్ల ప్రభుత్వం నుంచి రాయితీలు, పథకాలు అందక ఇబ్బందిపడుతున్నామని వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం తమ సమస్యను పరిష్కరించి న్యాయం చేయాలని కోరుతున్నారు. త్వరలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు విన్నవిస్తామని చెబుతున్నారు.



అమలాపురంలో పేలుడుతో ధ్వంసమైన ఇళ్లు



ప్రాజెక్టులను పరిశీలిస్తున్న కలెక్టర్ షాన్ మోహన్

## ప్రయోగాలపై పట్టు సాధించండి

**పిఠాపురం:** విద్యార్థులు ప్రజలకు ఉపయోగపడే ప్రాజెక్టుల తయారీకోసం ప్రయోగాలు మొదలు పెట్టాలని కలెక్టర్ షాన్ మోహన్ సూచించారు. పిఠాపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన ఫ్యూచర్-2024 సైన్స్ స్కేర్, ఎగ్జిబిషన్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల దశ నుంచే ఏదో ఒకటి సాధించాలనే ధ్యేయం ఉండాలని, తద్వారా భవిష్యత్తు అవసరాలకు ప్రజలకు ఉపయోగపడే వస్తువులు తయారు చేయాలన్నారు. ప్రయోగాలపై పట్టు సాధిస్తే శాస్త్రవేత్తలుగా ఎదిగి మరిన్ని విజయాలు సాధించవచ్చన్నారు. జిల్లా గురుకుల పాఠశాలల సమన్వయ అధికారి జి.వెంకటరావు, జిల్లా సైన్సు అధికారి శ్రీనివాస్ వినిల్‌కుమార్, ప్రిన్సిపల్ బీవీ వెంకటత్రివేణి, తదితరులు పాల్గొన్నారు.



బాలికలతో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి సివిల్ జడ్జి బుల్లెమ్మ

## వసతి గృహాల తనిఖీ

**ఏలేశ్వరం, న్యూస్‌టుడే:** ఏలేశ్వరం బీసీ బాలికల కళాశాల వసతి గృహాన్ని ఇన్‌ఛార్జి జూనియర్ సివిల్ జడ్జి బుల్లెమ్మ శుక్రవారం సందర్శించారు. హాస్టల్‌లో నిబంధనల మేరకు సౌకర్యాలు ఏ మేరకు ఉన్నాయో ఆమె పరిశీలించారు. బాలికలతో మాట్లాడుతూ వారికి సమకూరుతున్న సదుపాయాలపై ఆరా తీశారు. బియ్యం నాణ్యతను ఆమె పరిశీలించి తగు సూచనలు చేశారు. రికార్డులను ఆమె తనిఖీ చేశారు. తాగు నీరు, వంట గదిని ఆమె సందర్శించారు. బాలికలకు ఇబ్బందులు లేకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సివిల్ జడ్జి ఆదేశించారు. ప్యానల్ న్యాయవాదులు బుగత శివన్నారాయణ, బి.మధు, శ్రీలక్ష్మి ఉన్నారు.

## రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ

**కర్నూలు క్రీడలు:** కర్నూలు డీఎస్ఏ స్టేడియంలో ఎస్‌జీఎఫ్ అండర్-19 బాలబాలికల 68వ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. బాలుర విభాగంలో కాకినాడ జిల్లాకు చెందిన దుర్గాప్రసాద్(హైజంప్) స్వర్ణ పతకం, బాలికల విభాగంలో తూర్పు గోదావరి జిల్లాకు చెందిన పావని(పరుగు), చంద్రకళ(హైజంప్) రజత పతకాలు సాధించారు.

## ముగిసిన విశ్వవిద్యాలయ బాస్కెట్‌బాల్ జట్టు ఎంపికలు

**రాజానగరం, న్యూస్‌టుడే:** నన్నయ విశ్వవిద్యాలయంలో రెండు రోజులుగా నిర్వహించిన అంతర్ కళాశాలల బాస్కెట్‌బాల్ పోటీలు, విశ్వవిద్యాలయ జట్టు ఎంపిక శుక్రవారంతో ముగిశాయి. ఈ పోటీలలో విజేతలను ముఖ్యఅతిథిగా హాజరైన రిజిస్ట్రార్, స్పోర్ట్స్ బోర్డు ఇన్‌ఛార్జ్ కార్యదర్శి ఆచార్య జి.సుధాకర్ శుక్రవారం ప్రకటించారు. ఈ పోటీలలో రామచంద్రాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల మొదటి స్థానాన్ని, జి.మామిడాడలోని డీఆర్‌కె రెడ్డి కళాశాల ద్వితీయ, పెనుగొండలోని ఎస్‌వీకేపీ కళాశాల తృతీయ, ఏలూరు సీఆర్‌ఆర్ కళాశాల నాల్గవ స్థానాలను సాధించాయని ప్రకటించారు. క్రీడాకారులకు ట్రోఫీలు అందజేసి అభినందించారు. టీమ్ సెలక్షన్స్‌కు ఆయా కళాశాలల నుంచి హాజరైన 13 టీమ్‌లు, 12 మంది వ్యక్తిగత క్రీడాకారుల నుంచి ప్రతిభ కనబరిచిన 12 మంది క్రీడాకారులను, అదనంగా మరో నలుగురు క్రీడాకారులను నన్నయ విశ్వవిద్యాలయ జట్టుగా ఎంపిక చేశారని రిజిస్ట్రార్ ఆచార్య సుధాకర్ తెలిపారు. ఈ జట్టు నవంబరు ఒకటి నుంచి ఐదో తేదీ వరకు బెంగళూరులోని క్రైస్ట్ యూనివర్సిటీలో నిర్వహించే సౌత్‌జోన్ పోటీల్లో పాల్గొంటారన్నారు. నిర్వహణా కార్యదర్శి డా.ఎం.వి.ఎస్.ఎస్.మూర్తి, సెలక్షన్ కమిటీ సభ్యులు, రైల్వేకోచ్ ప్రసాద్, బాపిరెడ్డి, పరిశీలకుడు పీఆర్ కళాశాల పీడీ రమణ, కోర్స్ కోఆర్డినేటర్ డా.కె.బాలసత్యనారాయణ, డా.ఎ.సత్యనారాయణ, డా.బి.రామ్‌గోపాల్, డేవిడ్, పీడీలు, కోచ్‌లు పాల్గొన్నారు.



ఎంపికైన నన్నయ విశ్వవిద్యాలయ జట్టుతో రిజిస్ట్రార్ సుధాకర్

## నైపుణ్యాలతో అవకాశాలు సృష్టించుకోవాలి

**గాంధీనగర్, న్యూస్‌టుడే:** విద్యార్థులు తమ నైపుణ్యాలతో వీలైనంత ఎక్కువ మందిని కలుపుకొనేందుకు (కనెక్టింగ్) అవకాశాలను సృష్టించుకోవాలని, ప్రపంచంలో అమెరికన్ టెలిఫోన్ అండ్ టెలిగ్రాఫ్ (ఏటీఅండ్‌టీ) కంపెనీ ఉత్తమ కనెక్టివిటీ ప్రొవైడర్‌గా నిలుస్తోందని ఆ సంస్థ ఆసియా-పసిఫిక్ రీజినల్ హెడ్ పద్మజా శ్రీరామ్ అన్నారు. జేఎన్‌టీయూకేలో శుక్రవారం వర్సిటీ ఐఐపీఅండ్‌టీ డైరక్టరేట్, ఏటీఅండ్‌టీ కంపెనీ సంయుక్త ఆధ్వర్యంలో యూసీఈకేలోని బీటెక్ సీఎస్‌ఈ, ఈసీఈ తృతీయ, ఆఖరి సంవత్సరం విద్యార్థులకు ఇండస్ట్రీ ఇంటరాక్షన్ పేరిట నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఉన్నత స్థాయికి ఎదిగేందుకు రాజీ లేకుండా సరైన పద్ధతిలో పనిచేయడంతో పాటు ఎలాంటి పనిలోనైనా ప్రత్యేక పనితీరు చాటాలన్నారు. ఏటీఅండ్‌టీ సీనియర్ స్పెషలిస్ట్ ఎస్.గోపీనాథ్ మాట్లాడుతూ విద్యార్థులు సాఫ్ట్‌స్కిల్స్‌తో పాటు భావవ్యక్తీకరణ అంశాలపై దృష్టి పెట్టాలన్నారు. ప్రస్తుత సాంకేతిక రంగంలో ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని, వాటిని అందిపుచ్చుకునేందుకు నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. అనంతరం పద్మజా శ్రీరామ్, గోపీనాథ్ ఇన్‌ఛార్జి వీసీ మురళీకృష్ణను మర్యాదపూర్వకంగా కలిసి తమ కంపెనీ కార్యక్రమాలు, ప్రాజెక్టులు వివరించారు. కార్యక్రమంలో ఐఐపీఅండ్‌టీ డైరక్టర్ బి.టి.కృష్ణ, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ రవీంద్రనాథ్, యూసీఈకే ప్రిన్సిపల్ ఎన్.మోహనరావు, సీఎస్‌ఈ విభాగాధిపతి ఎస్.రామకృష్ణయ్య, ఈసీఈ విభాగాధిపతి బి.లీలాకుమారి, యూసీఈకే ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ అధికారి కరుణ, విద్యార్థులు పాల్గొన్నారు.



జేఎన్‌టీయూకే విద్యార్థులతో మాట్లాడుతున్న పద్మజా శ్రీరామ్

## ఇద్దరు వ్రత పురోహితుల సస్పెన్షన్

### నలుగురు సూపర్‌వైజర్లకు నోటీసులు

**అన్నవరం:** అన్నవరం దేవస్థానంలో వ్రత పురోహితులు పెండ్యాల వి.ఆర్.బి.కె శర్మ, రాయప్రోలు శ్రీ రామచంద్రమూర్తిలను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఈవో కె.రామచంద్రమోహన్ శుక్రవారం ఆదేశాలిచ్చారు. సత్యదేవుని వ్రతమాచరిస్తున్న భక్తుల నుంచి దానాల పేరుతో సొమ్ములు డిమాండ్ చేశారన్న ఫిర్యాదుతో చర్యలు తీసుకున్నారు. ఓ భక్తుడు ఇటీవల రూ.300 వ్రతం చేయించుకున్నారు. ఈ సమయంలో విధుల్లో ఉన్న పురోహితుడు దానాల పేరుతో సొమ్ము డిమాండ్ చేశారు. వ్రత కథ కూడా స్పష్టంగా వివరించలేదు. భక్తుడు రికార్డు చేసి నేరుగా ఈవోకు ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా మరో పురోహితుడిపై కూడా ఫిర్యాదు అందింది. దీనిపై విచారణ చేసి రెండో తరగతి పురోహితులు ఇద్దర్నీ విధుల నుంచి సస్పెండ్ చేశారు. వ్రత పూజ చేయించుకునే భక్తులకు పూజాసామగ్రి సక్రమంగా అందించడంలో పర్యవేక్షణ లోపం కారణంగా నలుగురు సూపర్‌వైజర్లకు షోకాజ్ నోటీసులు ఇచ్చారు. వ్రత పురోహితులతో ఈవో సమావేశం ఏర్పాటు చేశారు. భక్తులను ఇబ్బందులకు గురిచేసేలా కొంతమంది వ్యవహరిస్తుండటం సరికాదన్నారు. దానాల పేరుతో సొమ్ము అడిగినా, భక్తుల మనోభావాలు దెబ్బతినేలా వ్యవహరించినా చర్యలు తప్పవన్నారు.

## ప్రకటన

కాకినాడ జిల్లా కాకినాడ మండలం రమణయ్యపేట గ్రామ కాపురస్తులు **వాసిరెడ్డి యేసుదాసు గారి భార్య లీలావతి గారు** మాకు స్వయంగా యిచ్చిన సంజాయిషీపై యావన్మందికి తెలియజేయునది ఏమనగా.

ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్థిని మా క్లయింటు వద్దిపర్తి చలపతిరావు, రామారావు, మాధవరావు మరియు వద్దిపర్తి విజయలక్ష్మి గార్ల నుండి క్రయ అగ్రిమెంటు పొందియున్నారు. పైన తెలిపిన వారు అగ్రిమెంటు షరతులు ఉల్లంఘించి నందున వారిపై కోర్టులో దావా దాఖలు చేయుట జరిగినది. సదరు దావా హైకోర్టులో అప్పీలులో దాఖలు చేయుచున్నారు. షెడ్యూలు దాఖలా ఆస్థులను దావా సంగతులు కప్పి పుచ్చి అమ్మకము చేయుటకు వద్దివర్తి వారు ప్రయత్నించు చున్నారని మా క్లయింటుకు తెలియ వచ్చినది. కావున షెడ్యూలు దాఖలా ఆస్థితో ఎవరు అయినను క్రయ విక్రయములు వగైరా వ్యవహారములు జరిపినను మీరే నష్టపోవుదురని, సదరు వ్యవహారములు చెల్లనేరవని మరియు మా క్లయింటును బైండు చేయవని యిందు మూలముగా యావన్మందికి తెలియచేయడమైనది.

**షెడ్యూలు**

కాకినాడ జిల్లా, పిఠాపురం మండలం, పిఠాపురం మున్సిపాలిటీలోని పిఠాపురం గ్రామం సర్వేనెం. 437, 435 తాలుకు ఏక ప్రతిగాగల య.7.48ట్లు భూమికి హద్దులు. **తూర్పు :** రోడ్డు కొంత, యితరులు తాలుకు భూమి కొంత. **పడమర :** ఆచార్యులు వగైరాల భూమి. **ఉత్తరం :** రెడ్డెం సీతారాముగారి భూమి కొంత ఇతరుల తాలుకు భూమి కొంత. **దక్షిణం :** గోదావరి రోడ్డు కొంత, యితరుల భూమి కొంత.

సదరు హద్దులు మధ్యస్తమైన య.7.48ట్లు భూమి యావత్తు యాజ్‌మెంటు హక్కులతో సహా

పిఠాపురం
ది.24-10-24

**K.V.V. Chalapathi,** M.A., B.L., D.P.M., Advocate, D.No. 9-11-136, Near Gandhi Statue, Gandhi Nagar, Nookalamma Temple Street, Kakinada. Ph: 9848260426





## పంట కాలువ కబ్జాపై ఉప ముఖ్యమంత్రి ఆగ్రహం

ఈనాడు కథనానికి స్పందన

**పిఠాపురం:** కోలంకలోని పంట కాలువ కబ్జాపై ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నెల 22న 'ఈనాడు'లో 'పంట కాలువ కబ్జా' శీర్షికతో కథనం ప్రచురితమైంది. శుక్రవారం ఆయన ఆదేశాలతో రెవెన్యూ, పంచాయతీ రాజ్, జలవనరులశాఖల అధికారులు రంగంలోకి దిగారు. కబ్జాను తొలగించి, పొలాలకు నీరు వెళ్లేలా కాలువ తవ్వారు. ఈ సందర్భంగా పవన్‌కల్యాణ్ అధికారులతో మాట్లాడుతూ పంట కాలువను లేఅవుట్ కోసం కబ్జా చేస్తే ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదన్నారు. గతంలో సర్వే చేసినప్పటికీ ఆక్రమణలెందుకు తొలగించలేదని ప్రశ్నించారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గొద్దని దిశానిర్దేశం చేశారు. 'ఎవరు తప్పుచేసినా.. తనతో సహా ఉపేక్షించవద్దని చట్టం, నిబంధనలకు అనుగుణంగా వెళ్లాలని సూచించారు.

## చేనేత వర్గాలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి

**కాకినాడ కలెక్టరేట్:** కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో చేనేత వర్గాలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలని ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ జాతీయ కార్యనిర్వాహక సభ్యుడు పప్పు దుర్గారమేశ్ కోరారు. శుక్రవారం స్థానికంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో చేనేత సంఘాలు, చేనేత కుల సంఘాల ప్రతినిధులతో కలిసి ఆయన మాట్లాడారు. పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని బీసీల్లో అత్యధికంగా ఉన్న చేనేత వర్గాలకు రాష్ట్ర, జిల్లాస్థాయిలో నియమిత పదవులు ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో సమగ్ర శాస్త్రీయ కులగణన నిర్వహించాలని, చేనేత మంత్రిత్వ శాఖను చేనేత వర్గానికి చెందిన వారికే కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. సాధారణ ఎన్నికల్లో చేనేతవర్గానికి తగినన్ని సీట్లు ఇవ్వలేదని, ఎమ్మెల్సీ స్థానాల్లో ప్రాధాన్యం కల్పించాలన్నారు. మంగళగిరిలో నారా లోకేశ్ విజయానికి అక్కడి చేనేత కార్మికులు, కుల సంఘాల నేతలు విస్తృతంగా కృషిచేశాయని గుర్తుచేశారు. సమావేశంలో కొల్లు వెంకటేశ్వరరావు, పొన్నగంటి సత్యనారాయణ, ఇమంది చంద్రరావు, చిల్లపల్లి గణపతి, పలివెల లక్ష్మి, వాసా పరమేశ్వరరావు, ఆసపు నందీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దుర్గారమేశ్, చిత్రంలో ప్రతినిధులు

## మృతదేహానికి పరీక్షలు

**తొండంగి:** తొండంగి మండలం ఏవీనగరంకు చెందిన బత్తిన మధు (38) వారం కిందట మృతి చెందిన విషయం తెలిసిందే. ఇతని మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవడంతో శుక్రవారం పోలీసులు మధు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. తహసీల్దారు మురార్జి, ఎస్సై జగన్మోహనరావు, రైటర్ పాండురంగారావు, కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో తుని ప్రాంతీయ ఆస్పత్రి వైద్య బృందం ఎం.జగన్మోహనరావు, కిరణ్, ఏవీనగరం శ్మశాన వాటికలో పూడ్చిపెట్టిన మధు మృతదేహాన్ని బయటకు తీసి కొన్ని అవయవాలను తీసి విజయవాడ ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపినట్లు తెలిపారు. రిపోర్టుల ఆధారంగా నిందితులపై చర్యలు తీసుకుంటామన్నారు.

## మధ్యాహ్న భోజన సరకుల చోరీ సిబ్బంది పట్టివేత

*గండేపల్లి, న్యూస్‌టుడే:* విద్యార్థులకు వండి పెట్టాల్సిన మధ్యాహ్న భోజన పథక సిబ్బంది చేతివాటం ప్రదర్శించారు. పిల్లలకు వండి పెట్టాల్సిన బియ్యం, కోడిగుడ్లను ముగ్గురు సిబ్బంది ఇళ్లకు పట్టుకెళ్తుండగా ప్రధానోపాధ్యాయుడు పట్టుకుని హెచ్చరించిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలివీ.. గండేపల్లి మండలం తాళ్లూరు జడ్పీ పాఠశాలలో గురువారం మధ్యాహ్నం విద్యార్థులు భోజనాల అనంతరం అక్కడి మధ్యాహ్న భోజనాలు సిద్ధం చేసే సంబంధించిన ముగ్గురు మహిళలు సంచుల్లో ఒక్కొక్కరు సుమారు మూడు కేజీల చొప్పున బియ్యం, ఉడికించిన సుమారు 30 గుడ్లను తీసుకెళ్తుండగా గమనించిన హెచ్‌ఎం సత్యనారాయణ పట్టుకుని హెచ్చరించారు. దీనిపై హెచ్‌ఎం మాట్లాడుతూ.. జరిగిన విషయం వాస్తవమని, ఇలాంటి చర్యలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని సిబ్బందిని హెచ్చరించినట్లు తెలిపారు.

## యాసిడ్ పడి ఇద్దరికి గాయాలు

**తొండంగి:** మండలంలోని పెరుమాళ్లపురం ఫార్మా పరిశ్రమలో పని చేస్తున్న ఇద్దరు వ్యక్తులపై శుక్రవారం రాత్రి యాసిడ్ పడి గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. దీనిపై ఎస్సై జగన్మోహనరావును వివరణ కోరగా.. మాకు ఎలాంటి సమాచారం లేదని, ఎటువంటి ఫిర్యాదు రాలేదన్నారు. దీనిపై పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

## ధరవరలు

**అంబాజీపేట కొబ్బరి మార్కెట్**

| కొబ్బరి (క్వింటాళ్లలో) | ధర (రూ॥లలో) |
|---|---|
| కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి): | 11,500 |
| పాతకాయ: గండేరా | 16,000 |
| గటగట | 13,500 |
| కొత్తకాయ: గండేరా | 15,500 |
| గటగట | 13,500 |
| నీటి కాయ (వెయ్యింటికి): | |
| పాత (ముక్కుడు) కాయ | 12,000-13,500 |
| కొత్త (పచ్చి) కాయ | 11,500-12,000 |
| కొబ్బరినూనె మార్కెట్: | |
| 15 కిలోలు | 3,750 |
| కిలో | 260 |

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

**వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో**

| | |
|---|---|
| ఫారంరేటు | 120-00 |
| రిటైల్ లైవ్ | 142-00 |
| డ్రెస్డ్ | 206-00 |
| స్కిన్‌లెస్ | 234-00 |





# కాకినాడ

## 28న ఉద్యోగ మేళా

కాకినాడ కలెక్టరేట్: కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయంలో ఈనెల 28న ఉద్యోగ మేళా నిర్వహిస్తామని వికాస పీడీ కె.లచ్చారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ ఫార్మా కంపెనీలో టెక్నీషియన్, కెమిస్టు, హుండాయ్ మోబీస్, ఐసాన్ ఎక్స్‌పీరియన్సెస్, పానాసోనిక్, ఇసుజు మోటార్స్, ఇండో ఎంఐఎం కంపెనీల్లో టెక్నీషియన్, భవి క్రియేషన్స్ లో సేల్స్ మీడియా మేనేజరు, ఎస్ఈవో, వీడియో ఎడిటర్, గ్రాఫిక్ డిజైనర్, మార్కెటింగ్ మేనేజరు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, కంటెంట్ రైటర్ పోస్టులకు ముఖాముఖి నిర్వహిస్తారని వివరించారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమో, డిగ్రీ, బీటెక్, ఎంబీఏ ఉత్తీర్ణులైన 35 ఏళ్లలోపు అభ్యర్థులు అర్హులని తెలిపారు.

## నగరంలో సినిమాలు

గాంధీనగర్: ఆనంద్ సినిమాస్ 4 స్క్రీన్ - వెనమ్, విశ్వం, వేట్టయన్ ది హంటర్, లగ్గం, ఎంతపనిచేశావ్ చంటి, దేవీ మల్టీప్లెక్స్ 4 స్క్రీన్ - వెనమ్, లగ్గం, గ్యాంగ్‌స్టర్, విశ్వం, లక్ష్మీ - పొట్టేల్, సత్యగౌరి - వెనమ్, తిరుమల - వేట్టయన్ ది హంటర్, సీఅండ్‌సీ 1 - నరుడి బ్రతుకు నటన (ఉ, సా), జనక అయితే గనక (మ. రా), సీఅండ్‌సీ 2 - శ్వాగ్, శ్రీప్రియ - వెనమ్, పద్మప్రియ - దేవర పార్ట్ 1, సూర్య 1 (వాకలపూడి) - వెనమ్, సూర్య 2 - దేవర పార్ట్ 1, శ్రీశ్రీనివాసా (వేళంగి) - పొట్టేల్.


కార్మికులకు బోనస్ అందిస్తున్న కొండబాబు

## కార్మికుల శ్రేయస్సే కూటమి ప్రభుత్వ లక్ష్యం

కాకినాడ నగరం, సాంబమూర్తినగర్, న్యూస్‌టుడే: కార్మికుల శ్రేయస్సే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని నగర ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే స్వగృహంలో శ్రీవినాయక డీప్ వాటర్ పోర్టు కార్మిక సంఘం సభ్యులకు అధ్యక్ష, కార్యదర్శులు ఓలేటి పాదురంగడు, బలసాడి శ్రీను సమక్షంలో ఎమ్మెల్యే డ్యూటీ, బోనస్ సొమ్ములు అందించారు. ఈసందర్భంగా కొండబాబు మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో వినాయక డీప్ వాటర్ పోర్టు కార్మిక సంఘం సభ్యులు తెలుగుదేశం పార్టీకి మద్దతుగా నిలిచారనే నెపంతో అప్పటి ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి వారిని ఇబ్బందులకు గురిచేశారని వివరించారు. రాజకీయ కక్షతో వేతన బోనస్‌లు కూడా నిలిపివేశారన్నారు. తాజాగా 29 మంది సభ్యులకు రూ.8050 చొప్పున అందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో బలసాడి శ్రీను, పాలెపు ధర్మారావు, చిన్నాబ్బాయి, తాతీలు తదితరులు పాల్గొన్నారు.

## లింగ నిష్పత్తిపై ప్రత్యేకంగా దృష్టిపెట్టండి

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: భ్రూణహత్యల నివారణతో పాటు లింగ నిష్పత్తి తక్కువగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేకంగా దృష్టిసారించాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో గర్భస్థ లింగ నిర్ధారణ నిషేధ చట్టం జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అల్ట్రాసౌండ్ స్కానింగ్ కేంద్రాలపై నిరంతరం నిఘా కొనసాగించాలని, జిల్లాలో గుర్తింపుపొందిన 153 స్కానింగ్ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టాలన్నారు. గ్రామస్థాయిలో ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలు గర్భిణులు ఉన్న గృహాలు సందర్శించి, వారి ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించాలన్నారు. ఈ సందర్భంగా కొత్త స్కానింగ్ కేంద్రాల ఏర్పాటు, రెండు కేంద్రాల రెన్యువల్, ఏడు చోట్ల యంత్రాల ఏర్పాటు, ఒక్కో గుల నియామకం, రెండు ఐవీఎఫ్ కేంద్రాల ఏర్పాటుకు కమిటీ ఆమోదం తెలిపింది. అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 11న జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు కలెక్టర్ బహుమతులు, ధ్రువపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. సమావేశంలో మూడో అదనపు జిల్లా జడ్జి పి.కమలాదేవి, డీఎంహెచ్‌వో (ఇన్‌ఛార్జి) పి. రమేశ్, డీఐవో కేవీ సుబ్బారావు, డీసీహెచ్ఎస్ డాక్టర్ స్వప్న, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


విద్యార్థినికి బహుమతి అందిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

★ జిల్లాలో రహదారి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఆయన అధ్యక్షతన జిల్లా స్థాయి రహదారి భద్రతా కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆర్అండ్‌బీ ఎస్ఈ జి.కురు, డీటీసీ శ్రీధర్, డీఎంహెచ్‌వో (ఇన్‌ఛార్జి) రమేశ్, డీసీహెచ్ఎస్ స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

★ జిల్లాలో బాలల సంక్షేమానికి కలిసికట్టుగా కృషిచేయాలని కలెక్టర్ షాన్ మోహన్ సూచించారు. కలెక్టరేట్‌లో మూడో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి పి. కమలాదేవి అధ్యక్షతన మిషన్ వాత్సల్య ప్రమోషన్ బాలల సంరక్షణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. తల్లిదండ్రులు లేని, పాక్షిక అనాథలకు స్పాన్సర్‌షిప్ పథకం కింద నెలకు రూ.4 వేల చొప్పున అందిస్తున్నామన్నారు. ఐసీడీఎస్ పీడీ కె.ప్రవీణ, జిల్లా బాలల సంరక్షణాధికారి సీహెచ్.వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

★ జిల్లాలో క్షయ పీడితుల గుర్తింపునకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో టీబీ ముక్త్ పంచాయత్ సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో 14 పంచాయతీలు టీబీ ముక్త్ పంచాయత్‌లుగా ఎంపికయ్యాయని చెబుతూ ఆయా పంచాయతీలకు గాంధీజీ కాంస్య విగ్రహాలు, ప్రశంసాపత్రాలు కలెక్టర్ అందించారు. సమావేశంలో జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ ఆర్.రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## బాణసంచా విక్రయాల్లో నిబంధనలు తప్పనిసరి

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: బాణసంచా విక్రయాల్లో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్డీవో ఎస్.మల్లిబాబు హెచ్చరించారు. శుక్రవారం ఆర్డీవో కార్యాలయంలో రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక శాఖల అధికారులు, బాణసంచా దుకాణదారులతో ఆయన సమావేశం నిర్వహించారు. అనంతరం మెక్లారిన్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేస్తున్న విక్రయ కేంద్రాలు తనిఖీచేశారు. సమావేశంలో తహసీల్దార్లు జితేంద్ర, కుమారి, ఎంహెచ్‌వో పృథ్వీచరణ్ తదితరులు పాల్గొన్నారు.

### దీపావళి జాగ్రత్తలపై అవగాహన

మసీదు సెంటర్ (కాకినాడ): దీపావళి వేడుకల్లో మందుగుండు సామగ్రి కారణంగా పిల్లలకు ముప్పు ఉంటుందని, కొన్ని కాలిన గాయాలు ప్రాణాంతకమని జీజీహెచ్ ప్లాస్టిక్ సర్జరీ విభాగాధిపతి డా.బి.రత్నభూషణ్ తెలిపారు. శుక్రవారం మహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూల్‌లో సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి, ఆర్ఎంసీ ప్రిన్సిపల్ డాక్టర్ నరసింహం, వైస్‌ప్రిన్సిపల్ డాక్టర్ విష్ణువర్ధన్ సహకారంతో విద్యార్థులకు దీపావళి పండుగ వేళ తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కాలిన గాయాల నివారణ తదితర అంశాలపై సేఫ్ దీపావళి ప్రచార అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఎంసీ ఎన్ఎస్ఎస్ విభాగం, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## 28 మందికి జైలు, జరిమానా

మసీదు సెంటర్ (కాకినాడ): మద్యం తాగి వాహనం నడిపిన 28 మందిపై కేసులు నమోదుచేసి కోర్టులో హాజరుపరచగా 10 మందికి రెండు రోజుల పాటు జైలు, 18 మందికి రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ కాకినాడ మూడో అదనపు సెకెండ్ క్లాస్ జేఎఫ్‌సీఎం కోర్టు న్యాయమూర్తి వి.నరసింహారావు శుక్రవారం తీర్పు చెప్పారు. రోడ్డు ప్రమాదాలు తగ్గించాలనే ఉద్దేశంతో నగర ట్రాఫిక్-1, 2 విభాగాల పరిధిలో తనిఖీలు నిర్వహించి 28 మందిపై కేసులు నమోదు చేశామని సీఐలు ఎన్.రమేష్, రామారావు తెలిపారు.

## ద్విచక్ర వాహనాల చోరీ కేసులో ముగ్గురికి జైలు

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: వ్యసనాలకు బానిసలై ద్విచక్ర వాహనాలు దొంగిలించిన కేసులో ముగ్గురికి ఏడాది జైలు, రూ.1000 చొప్పున జరిమానా విధిస్తూ కాకినాడ ఒకటో అదనపు జేఎఫ్‌సీఎం జడ్జి వి.సాహితి తీర్పు చెప్పారు. ఈ విషయాన్ని వివరిస్తూ కాకినాడ రెండో పట్టణ పోలీసులు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కాకినాడకి చెందిన దమ్ము శివప్రసాద్, ములపర్తి కిషోర్, గుండారపు శివరామ్ సాయి ముగ్గురు కలిసి వ్యసనాలకు బానిసలయ్యారు. నగరంలోని పలుచోట్ల బైకులు చోరీ చేస్తూ వాటిని విక్రయించగా వచ్చిన డబ్బుతో జల్సాలు చేసేవారు. 2023 ఫిబ్రవరి 25న కాకినాడకు చెందిన గున్నాబత్తుల భవానీశంకర్ బుల్లెట్, ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నిలిపిన బైక్ చోరీకి గురయ్యాయి. బాధితులు పోలీసులను ఆశ్రయించారు. దీనిపై పోలీసులు కేసు నమోదుచేసి నిందితులను గుర్తించారు. కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ రఘువీర్ వాదనలు వినిపించారు.

## బాలుడి అదృశ్యంపై ఫిర్యాదు

మసీదు సెంటర్ (కాకినాడ): నగరంలోని జగన్నాథపురానికి చెందిన తొమ్మిదేళ్ల బాలుడు వనమాడి సాత్విక్ అదృశ్యంపై తండ్రి సిద్ధయ్య శుక్రవారం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం మధ్యాహ్నం ఆడుకోవడానికి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని పేర్కొన్నారు.

# అందని శుద్ధ జలాలు

### వైకాపా నిర్వాకం.. ప్రజలకు శాపం

కాకినాడ నగరం, సాంబమూర్తినగర్, న్యూస్‌టుడే: తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం గతంలో ఎన్టీఆర్ సుజల పథకంలో భాగంగా 2 రూపాయలకే 20 లీటర్ల శుద్ధ జలాలు అందించింది. కాకినాడ నగరంలో 2014-19 మధ్య కాలంలో ఆరు చోట్ల శుద్ధనీటి ప్లాంట్లను నెలకొల్పింది. అప్పట్లో నగర ప్రజలకు నామమాత్రపు ధరకే పరిశుభ్రమైన తాగునీరు అందింది. అనంతరం అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం తెదేపాపై అక్కసుతో ఈ పథకాన్ని అటకెక్కించింది. వైకాపా నిర్వాకంతో తాగునీరు సైతం అందని పరిస్థితి నెలకొంది.


గొడారిగుంటలో..

ఎన్టీఆర్ సుజల పథకంలో గెయిల్, ఓఎన్జీసీ, కాకినాడ సీపోర్టు తదితర సంస్థలు సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులతో ఆరు చోట్ల ప్లాంట్లు ఏర్పాటుచేశారు. రూ.3 లక్షల నుంచి 5 లక్షల వ్యయంతో ఒక్కో ప్లాంట్ ఏర్పాటుచేసి నిర్వహణ బాధ్యతను నగరపాలక సంస్థకు అప్పగించారు. నగరంలో రేచర్లపేట, రాగంపేట, పాతబస్టాండు (పగోడ స్కూలు పక్కన), ఘాటీ సెంటర్, ముత్తానగర్, గొడారిగుంట ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన ప్లాంట్ల ద్వారా రూ.2లకే 20 లీటర్ల చొప్పున తాగునీరు అందించేలా ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్లాంట్లు అందుబాటులో ఉండేవి. వేసవిలో కూడా అన్ని వేళల్లో తాగునీటి కష్టాలను ఇవి తీర్చేవి. తక్కువ ధరకే సురక్షిత నీరు అందుబాటులో ఉండడంతో ప్లాంట్లు విజయవంతమయ్యాయి.

### మూసివేతతో తప్పని ఇక్కట్లు..

వైకాపా ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్లాంట్ల నిర్వహణను గాలికొదిలేసింది. ప్లాంట్ల నిర్వహణ, విద్యుత్తు బిల్లుల చెల్లింపులను నిలుపు చేయడంతో ప్లాంట్లన్నీ మూతపడ్డాయి. ఫలితంగా ప్రజలకు రక్షిత నీరు అందుబాటులో లేకుండాపోయింది. అలాగే


పగోడ స్కూలు వద్ద మూతపడ్డ సుజల ప్లాంటు

ప్లాంట్ల వద్ద నీటి విక్రయానికి ఒక్కో వ్యక్తిని నియమించారు. వారు నిర్వహణతో జీవనోపాధి పొందేవారు. నీటి విక్రయాలతో వీరికి జీతాలు చెల్లించేవారు. విద్యుత్తు బిల్లును నగరపాలక సంస్థ భరించేది. ప్లాంట్ల మూతతో వీరు జీవనోపాధిని కోల్పోయారు.

### కూటమి ప్రభుత్వంపై ఆశలు..

ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్లాంట్ల పునరుద్ధరణపై ఆశలు చిగురుస్తున్నాయి. అప్పటి తెదేపా ప్రభుత్వంలో అమలుచేసిన ప్రజోపయోగ పథకాలను మళ్లీ అమలు చేయడానికి చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే అన్న క్యాంటీన్లు తెరుచుకున్నాయి. త్వరలోనే ఎన్టీఆర్ సుజల ప్లాంట్లను తిరిగి ప్రారంభిస్తారని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

## భళా.. మెప్మా బజారు..!

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: నగరంలోని పోలీసు క్వార్టర్ల సమీపంలోని మీసేవా కేంద్రంలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో మహిళా స్వయం సహాయ సంఘాల సభ్యులు తయారుచేసిన ఉత్పత్తులతో ఏర్పాటుచేసిన ప్రదర్శనను శుక్రవారం మెప్మా పీడీ బి.ప్రియంవద ప్రారంభించారు. రెండు రోజుల పాటు ప్రదర్శనను నిర్వహించనున్నారు. మహిళలు స్వయంగా తయారుచేసిన జూట్ బ్యాగులు, దుస్తులు, అల్లికలతో పాటు వివిధ తినుబండారాలు, పోషకాహార ఉత్పత్తులను అమ్మకాలకు ఉంచారు. పర్యావరణ హితంగా, ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ఉత్పత్తులను తయారుచేసి, విక్రయిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మెప్మా సీటీ మిషన్ మేనేజరు డేగల వెంకటరాజు, సీవోలు, ఆర్పీలు, తదితరులు పాల్గొన్నారు.


ఉత్పత్తులను పరిశీలిస్తున్న మెప్మా పీడీ ప్రియంవద

# అర్జీదారుల సంతృప్తే ముఖ్యం

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: అర్జీదారుల సంతృప్తే ముఖ్యంగా సానుకూల దృక్పథంతో పనిచేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ భావన సూచించారు. శుక్రవారం కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ వేదికకు వచ్చిన అర్జీల పరిష్కార ప్రగతిపై ఆమె సమీక్షించారు. ఇప్పటివరకు ఎన్ని అర్జీలు వచ్చాయి.. ఎన్ని పరిష్కరించారు.. ఇంకా ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి.. అందుకు కారణాలేంటి.. ప్రజల సంతృప్తి స్థాయి ఎలా ఉంది.. అనే అంశాలపై కమిషనర్ ఆరా తీశారు. రాష్ట్ర ప్రభుత్వం అర్జీల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని, ఈ విషయంలో విభాగాధిపతులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి 15 రోజులకు ఒకసారి సమీక్షిస్తామని, ప్రగతి చూపకపోతే చర్యలు తప్పవన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ సుభాకర్, ఉప కమిషనర్ మనోహర్, పర్యవేక్షక ఇంజినీరు కామేశ్వరరావు, ఎంహెచ్‌వో పృథ్వీచరణ్, తదితరులు పాల్గొన్నారు.


సమీక్షిస్తున్న కమిషనర్ భావన, హాజరైన అధికారులు

### మున్సిపల్ కార్మికుల సమస్యలపై వినతి

కాకినాడ కలెక్టరేట్: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్, కాకినాడ నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారి షాన్‌మోహన్‌కు సీఐటీయూ ప్రతినిధులు పలివెల వీరబాబు, మలకా వెంకటరమణ శుక్రవారం వినతి పత్రం అందించారు. 2023 డిసెంబరు నుంచి 2024 జనవరి వరకు పారిశుద్ధ్య కార్మికులు సమ్మెచేసిన కాలానికి జీతం, సంక్రాంతి బోనస్‌గా రూ.1000 చెల్లిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినా అమలు కాలేదన్నారు. ఆ వారం పారిశుద్ధ్య కార్మికులకు సెలవు అమలు చేయాలన్నారు. ప్రత్యేక పారిశుద్ధ్య కార్మికులకు ఆరు నెలలు, వాటర్ వర్క్స్ డ్రైవర్లకు రెండు నెలల వేతనాలు రావాల్సి ఉందన్నారు. కారుణ్య నియామకాలు జాప్యం లేకుండా చేపట్టాలని కోరారు. ఆయా సమస్యల పరిష్కారానికి సంయుక్త సమావేశం ఏర్పాటు చేయాలని కార్పొరేషన్ కమిషనర్‌ను కోరినా ఇప్పటికి నిర్వహించలేదన్నారు. ప్రత్యేక అధికారిగా చొరవ తీసుకుని కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు.

## పోలీసుల విధులపై విద్యార్థులకు బోధన

మసీదు సెంటర్ (కాకినాడ): పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా కాకినాడ ఒకటో పట్టణ పోలీసు స్టేషన్‌లో పాఠశాల విద్యార్థినులకు ఓపెన్ హౌస్ పేరిట పోలీసు విధి విధానాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. వన్ టౌన్ సీఐ ఎం.నాగదుర్గారావు మాట్లాడుతూ కానిస్టేబుల్, ఎస్సై, డీఎస్పీ, ఎస్పీ తదితర ఉద్యోగాలకు పోటీ పరీక్షల ద్వారా నేరుగా ఎంపికకావచ్చన్నారు. మిగిలిన పోస్టులు ప్రమోషన్ ద్వారా వస్తాయని విద్యార్థులకు అవగాహన కల్పించారు. పోలీసు స్టేషన్ రిసెప్షన్, లాకప్, వాకీటాకీ, ఎఫ్ఐఆర్ ఎలా రాస్తారు, సీడీ, ఎస్సై, రైటర్ విధులపై బోధపర్చారు. కార్యక్రమంలో వన్ టౌన్ ఎస్సైలు స్వామినాయుడు, కుమార్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## చెత్త సేకరణ వాహనాల నిలిపివేత

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ పరిధిలో ఇంటింటా చెత్త సేకరణ చేసే టిప్పర్ వాహనాలను శుక్రవారం నిలిపివేశారు. మూడు నెలల వేతన బకాయిలు చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐ సొమ్మును కార్మికుల ఖాతాలకు జమ చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం వాహన యార్డు వద్ద డ్రైవర్లు ఆందోళన నిర్వహించారు. నగరంలో మొత్తంగా 105 వాహనాల ద్వారా 120 మంది డ్రైవర్లు చెత్త సేకరణ ప్రక్రియలో పనిచేస్తున్నారని, వీరికి సకాలంలో వేతనాలు చెల్లించడం లేదని సీఐటీయూ నాయకుడు మలకా వెంకటరమణ ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేషన్ అధికారులకు పలుమార్లు వినతులు అందజేసినా పరిష్కరించకపోవడం లేదని ఆరోపించారు. ఇదే విధానం కొనసాగితే పూర్తిగా వాహనాలను నిలిపివేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో క్లాప్ డ్రైవర్స్ యూనియన్ ప్రతినిధులు ఇస్మాయిల్, శివశంకర్, దుర్గాప్రసాద్, కె.రాము, భైరవస్వామి తదితరులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న డ్రైవర్లు

## రైతుబజార్‌ను సంస్కరించాలి

మసీదుసెంటర్, న్యూస్‌టుడే: ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని రైతుబజార్‌లో కుమ్ములాటలకు అధికారులు ఆజ్యం పోస్తున్నారని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు ఆరోపించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ అయిదేళ్లుగా రైతుబజార్ అధికారులు కొనసాగుతున్నారని, వారిని కూటమి ప్రభుత్వం బదిలీ చేయకపోవడం వల్లే రైతులు రెండువర్గాలుగా విడిపోయి పోలీసుస్టేషన్ వరకు వెళ్లే పరిస్థితి నెలకొందన్నారు. కొందరు ప్రజాప్రతినిధుల అనుచరులు, రాజకీయాలు చేస్తుండడంతో రైతుబజార్‌లో తగాదాలు తీవ్రమవుతున్నాయని ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యే, పౌర సరఫరాల శాఖ మంత్రి, ఛైర్మన్ జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలన్నారు.

# పోటీలతో సృజనాత్మకత పెంపొందుతుంది

సాంబమూర్తినగర్ (కాకినాడ), న్యూస్‌టుడే: ప్రతిభకు మెరుగులు దిద్దేలా నిర్వహించే పోటీలు పిల్లల్లో సృజనాత్మకతను పెంపొందిస్తాయని సామా స్కూల్ అకడమిక్ డైరెక్టర్ సామా రాజేశ్వరి అన్నారు. జగన్నాథపురంలోని సామా స్కూల్‌లో 'ఈనాడు' ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. 'ఇంటర్నెట్ వినియోగంతో లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో 8, 9, 10 తరగతుల విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను చాటారు. పోటీల్లో గొడవర్తి భువన్ యశ్వంత్ (10వ తరగతి) ప్రథమ బహుమతి, వి. లిఖిత్ సూర్య (9వ తరగతి) ద్వితీయ బహుమతి, డి. నిఖిల్ (8వ తరగతి) తృతీయ బహుమతి సాధించారు. అకడమిక్ డైరెక్టర్ రాజేశ్వరి చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందించారు. ప్రెసిడెంట్ ఈశ్వరరావు, వైస్ ప్రిన్సిపల్ ఆరిఫ్, సీహెచ్.శ్రీనివాస్, సయ్యద్ మౌలానా, ఎ. సత్యనారాయణ, వై.సత్యవేణి తదితరులు విజేతలను అభినందించారు.


వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు


విజేతలతో రాజేశ్వరి, ఈశ్వరరావు, హనుమంతరావు

## రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన

మసీదు సెంటర్ (కాకినాడ): రొమ్ము క్యాన్సర్ రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్ఎంసీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా.ఎల్.సౌమ్య తెలిపారు. శుక్రవారం జీజీహెచ్‌లో రొమ్ము క్యాన్సర్ అవగాహన మాసోత్సవాల్లో భాగంగా రంగరాయ వైద్య కళాశాల జాతీయసేవా పథకం (ఎన్ఎస్ఎస్), కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు, ఆసుపత్రి ఆవరణలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ మెడిసిన్ వైద్య నిపుణులు డా.ఎంవీప్రియాంక, డా. ఎస్.రుక్మిణి, పీజీలు, వైద్య విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో వైద్యులు, వైద్య విద్యార్థులు తదితరులు

## క్రీడాకారులకు అభినందన

మసీదుసెంటర్: రాజమహేంద్రవరంలోని రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఇటీవల జరిగిన 68వ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రైఫిల్ షూటింగ్ పోటీల్లో కాకినాడకి చెందిన ఆశ్రం పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఎన్.వి.శ్రీకాంత్ అండర్-19 విభాగం జట్టు విభాగంలో ప్రథమ బహుమతి, వ్యక్తిగత విభాగంలో రజత పతకం సాధించాడు. చంద్రహాస్ వ్యక్తిగత విభాగంలో రజత పతకం సాధించి డిసెంబర్‌లో భోపాల్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

## జనరిక్ మందులు చేరువ చేయాలి

గాంధీనగర్, న్యూస్‌టుడే: జనరిక్ మందుల షాపులు ప్రజలకు చేరువకావాలని, వైద్యులు జనరిక్ పేరుతో చీటీలు రాయాలని, ఫార్మా కంపెనీల దోపిడీని అరికట్టాలని కోరుతూ ఈనెల 30న కలెక్టరేట్ వద్ద నిరసన నిర్వహిస్తామని ఆర్‌సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రంబాల సతీష్ పేర్కొన్నారు. శుక్రవారం జ్యోతుల మార్కెట్ సమీపంలోని ఆర్‌సీపీఐ కార్యాలయంలో ఫెడరేషన్ ఆఫ్ నేషనల్ ట్రేడ్ యూనియన్స్ (ఎఫ్ఎన్‌టీయూ) ఆధ్వర్యంలో ఆయన కరపత్రాలు ఆవిష్కరించారు. ఆర్‌సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రంబాల సతీష్, ఎఫ్ఎన్‌టీయూ జిల్లా నాయకులు సూరిబాబు మాట్లాడారు.

# న్యాయం జరిగే వరకూ కూరగాయల విక్రయాలు బంద్

గాంధీనగర్, న్యూస్‌టుడే: ఆర్టీసీ కాంప్లెక్సు సమీపంలోని రైతుబజార్‌లో రైతులు, ఇంగ్లిష్ కూరగాయలు విక్రయించే వ్యాపారుల మధ్య నెలకొన్న వివాదం రోజురోజుకూ ముదురుతోంది. నిబంధనల ప్రకారం ప్రతి వారం డ్రాతీసి కూరగాయలు విక్రయించే దుకాణాలు కేటాయించాలని, ఇంగ్లిష్ రకం కూరగాయలు అమ్మేవారికి మినహాయింపులు ఎలా ఇస్తారని రైతులు శుక్రవారం ఎస్టేట్ అధికారి కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ విషయంలో న్యాయంచేసే వరకూ కూరగాయల విక్రయాలు నిలిపివేస్తామని భీష్మించారు. వైకాపా హయాంలో కొందరు ఇంగ్లిషు రకాల కూరగాయలు అమ్మేందుకు దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారని, కూటమి ప్రభుత్వం వచ్చాక వారంతా కూటమి పార్టీల్లో చేరి తెదేపా నాయకులు అండదండలతో తమపై పెత్తనం చెలాయిస్తున్నారని ఆరోపించారు. శుక్రవారం కొందరు మందీమార్బలంతో వచ్చారని తమకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. రైతుబజార్‌లో కార్నర్ షాపులను కొందరికే ఇవ్వడం తగదని వాటిని కూడా డ్రాలోనే కేటాయించాలని పట్టుబట్టారు. ఇటీవల జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా రైతుబజార్‌ను పరిశీలించినపుడు ఈ విషయాన్ని ఆయనకు తెలియజేశామన్నారు. రైతుబజార్ ఎస్టేట్ అధికారులు గోవిందరాజు, కృష్ణారావు రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా రైతులు వెనక్కితగ్గలేదు. మధ్యాహ్నం నుంచి కూరగాయల విక్రయాలు నిలిపివేయడంతో పలువురు కొనుగోలుదారులు వెనక్కి వెళ్లిపోయారు. సాయంత్రం రైతుబజార్‌కు చేరుకున్న మార్కెటింగ్ శాఖ ఏడీ నాగేశ్వరరావు సమస్య పరిష్కారానికి కృషిచేస్తామని, విక్రయాలు ప్రారంభించాలని సూచించారు. లేదంటే ప్రత్యేక కౌంటర్లు పెట్టి అమ్మకాలు ప్రారంభిస్తామని వివరించారు.


ఎస్టేట్ అధికారి కార్యాలయం ముందు ధర్నాలో రైతులు

# కాకినాడ గ్రామీణం

• కాకినాడ గ్రామీణం • పెద్దాపురం • పిఠాపురం

## తల్లిదండ్రులకు ప్రేమాభిమానాలు పంచండి



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జ్యోతిర్మయి

**పెద్దాపురం:** వృద్ధాప్యంలో తల్లిదండ్రులకు పిల్లలు ప్రేమాభిమానాలు పంచాలని పెద్దాపురం మహారాణి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జ్యోతిర్మయి కోరారు. కళాశాల ఆవరణలో శుక్రవారం జిల్లా సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వృద్ధులకోసం కేంద్ర ప్రభుత్వం 2007లో చేసిన చట్టాలతో ఏపీలో 2011లో ధర్మాసనం ఏర్పాటైందన్నారు. బళ్లమూడి సూర్యనారాయణమూర్తి, జాస్తి రమేష్, సుధాకర్, ప్రసాద్, శ్యామల, సత్యనారాయణ పాల్గొన్నారు.

## ఉన్నత పాఠశాలలో గ్రీన్ టాయిలెట్లు



ప్రారంభ కార్యక్రమంలో నెస్లే కంపెనీ ప్రతినిధులు

**గొల్లప్రోలు, న్యూస్‌టుడే:** తాటిపర్తి జడ్పీ ఉన్నత పాఠశాలలో బాలికలకోసం నెస్లే ఇండియా లిమిటెడ్ కంపెనీ రూ.5 లక్షలతో ప్రత్యేకంగా నిర్మించిన గ్రీన్ టాయిలెట్లను సంస్థ కార్పొరేట్ వ్యవహారాల మేనేజర్ వసీం అహ్మద్ శుక్రవారం ప్రారంభించారు. పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్ దాసం వెంకటరమణ, హెచ్‌ఎం జి.నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటా సమాచార సేకరణ



గోడపత్రిక ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నానాజీ

**సర్పవరం జంక్షన్, గొల్లప్రోలు, పెద్దాపురం:** పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో 21 వ అఖిల భారత పశుగణన-ఆంధ్రప్రదేశ్ కార్యక్రమం ద్వారా ఫిబ్రవరి 28వ తేదీ వరకు ఇంటింటికీ వెళ్లి పశువుల సమాచారం సేకరిస్తారని, సిబ్బందికి పాడిరైతులు సహకరించాలని ఎమ్మెల్యే పంతం నానాజీ తెలిపారు. కాకినాడ గొడారిగుంటలోని కార్యాలయంలో శుక్రవారం గోడపత్రిక విడుదల చేశారు. ● చేబ్రోలులోని పవన్‌కల్యాణ్ నివాసంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి మర్రెడ్డి శ్రీనివాస్ 21వ అఖిల భారత పశుగణన కార్యక్రమ పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. ఏడీలు రమేష్‌చంద్ర, శ్రీనివాసరావు, పశువైద్యులు పాల్గొన్నారు. ● పెద్దాపురంలోని పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో పశుగణన గోడప్రతులను శుక్రవారం పెద్దాపురం పురపాలిక కమిషనర్ కేవీ పద్మావతి ఆవిష్కరించారు. డాక్టర్ రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



రాజేష్



చాందిని



దేవిశెట్టి వెంకటదుర్గ

**సామర్లకోట గ్రామీణం, కరప:** మాధవపట్నం పాఠశాలకు చెందిన డి. రాజేష్ రాజమహేంద్రవరంలో జరిగిన ఎస్‌జీఎఫ్ అథ్లెటిక్స్ ఎంపికలో 1500 మీటర్ల పరుగులో మొదటి స్థానంలో నిలిచాడు. హెచ్‌ఎం గోవిందరాజు, పీఈటీ గోవింద్ అభినందించారు. నవర పాఠశాలకు చెందిన చాందిని జావెలిన్ త్రో, డిస్కస్ త్రో పోటీల్లో ప్రథమ స్థానం సాధించిందని హెచ్‌ఎం సత్యవతి, పీఈటీ జయలక్ష్మి తెలిపారు. చంద్రంపాలెం ఉన్నతగూడెం పాఠశాల విద్యార్థిని దేవిశెట్టి వెంకటదుర్గ 100, 200 మీటర్ల పరుగులో మొదటి స్థానం దక్కించుకుంది. కరప మండలం పెద్దాపురప్పాడు పాఠశాలకు చెందిన మండపాక లక్ష్మీప్రసన్నదుర్గ 200 మీటర్ల పరుగులో 3వ స్థానాన్ని సాధించింది. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎం భాస్కరకుమార్, పీడీ వీరబాబు అభినందించారు. ● అండర్-17 కేటగిరీలో జావెలిన్ త్రోలో బండే వీరమణికంఠ, 200 మీటర్ల పరుగులో మేడిశెట్టి రాంబాబు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని వేళంగి జడ్పీ ఉన్నత పాఠశాల పీఈటీ కృష్ణ తెలిపారు. హెచ్‌ఎం భారతి, ఉపాధ్యాయులు విద్యార్థులతోపాటు పీఈటీని అభినందించారు.



వీరమణికంఠ, రాంబాబులతో పీడీ కృష్ణ

## పాఠశాలకు కుర్చీల వితరణ

**పెద్దాపురం:** ఆర్బీపట్నం జడ్పీ ఉన్నత పాఠశాల, ఎంపీపీ మెయిన్, ఎంపీపీ-1 పాఠశాలకు గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థులు రూ.20 వేలతో కుర్చీలను శుక్రవారం అందించారు. జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎన్ఆర్ఈజీఎస్‌లో సుమారు వంద కొబ్బరి మొక్కలు నాటారు. ప్రసన్నకుమార్, శ్రీను, దొరబాబు, సురేష్, మల్లేశ్వరరావు, చిన్నా, ఫణీంద్ర, శ్రీను, అయ్యప్ప పాల్గొన్నారు.

# వంటింట.. ఆనందమంట..!

● మహిళలకు ఉచితంగా గ్యాస్ సిలిండర్లు

కూటమి ప్రభుత్వం సంక్షేమ పాలనకు పెద్దపీట వేస్తోంది. ఇటీవల పరిపాలన మొదలైన 100 రోజులకే మూడు హామీలు అమలు చేసిన ప్రభుత్వం కొత్తగా నాలుగో పథకానికి క్యాబినెట్ ఆమోదం పొందింది. దీపావళి నుంచి సూపర్ సిక్స్‌లో భాగంగా దీపం పథకం ద్వారా ఉచితంగా గ్యాస్ సిలిండర్లు ఇచ్చేందుకు సిద్ధమవుతోంది. దాంతో మహిళల్లో ఆనందం వ్యక్తమవుతోంది. - న్యూస్‌టుడే, పిఠాపురం



హెచ్‌పీ గ్యాస్ కంపెనీ వద్ద సిలిండర్లు

పిఠాపురం, పెద్దాపురం, కాకినాడ గ్రామీణ నియోజకవర్గాల్లో ఈ నెల 29 నుంచి ఉచిత సిలిండర్లు అందించేందుకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ఇప్పటికే మండలాల వారీగా పౌర సరఫరాలశాఖ అధికారులు నివేదిక సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపించారు. ఇందులో భాగంగా ఏపీ క్యాబినెట్ బుధవారం సమావేశమైంది. ఎన్నికలప్పుడు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని హామీ ఇవ్వడంతో మహిళలు కూటమి ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారు. ఈ పథకం ద్వారా ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా అందించేందుకు ఆమోదం తెలిపారు. పథకాన్ని దీపావళి రోజు నుంచే అమలు చేయాలని నిర్ణయించారు. దీపం, ఉజ్వల్, సీఎస్ఆర్, జనరల్ విభాగాల్లో ప్రతి మండలంలోనూ గ్యాస్ సిలిండర్లు అందించారు. వీరికి హెచ్‌పీ, ఇండేన్, భారత్ గ్యాస్ కంపెనీల ద్వారా సిలిండర్లు సరఫరా చేస్తున్నారు. రేషన్‌కార్డుల వారీగా ఎంతమంది గ్యాస్ వినియోగిస్తున్నారనే వివరాలు ఇటీవల సేకరించారు. ఏయే విభాగాల వారీగా గ్యాస్ ఇవ్వనున్నారో ఇంకా పూర్తిస్థాయిలో వివరాలు వెల్లడించలేదు. ప్రస్తుతం బండ గ్యాస్ ధర రూ.876 ఉండగా, కేంద్రం రూ.25 సబ్సిడీ ఇస్తోంది. ప్రజలు రూ.851 చెల్లిస్తున్నారు. ఉచిత సిలిండర్లతో ఒక్కో ఇంటికి ఏటా రూ.2,553 ప్రయోజనం చేకూరనుంది.

**సిలిండర్ల వివరాలు ఇలా..**

| పట్టణం | వినియోగదారులు |
|---|---|
| పిఠాపురం | 23,200 |
| గొల్లప్రోలు | 20,400 |
| కొత్తపల్లి | 14,363 |
| పెద్దాపురం | 57,600 |
| సామర్లకోట | 47,246 |
| కరప | 17,400 |
| కాకినాడ గ్రామీణం | 86,000 |

**వివరాలు సేకరించాం**

ఏజెన్సీలు, మండలాల వారీగా గ్యాస్ సిలిండర్ల వివరాలు సిద్ధంగా ఉన్నాయి. వివిధ కంపెనీల ద్వారా ప్రజలకు సిలిండర్లు సరఫరా చేస్తున్నారు. ఇందులో రాయితీ సిలిండర్లు కూడా ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం ఉజ్వల్ పథకం కింద కూడా ఇటీవల సిలిండర్లు అందజేసింది. ఏయే కేటగిరిల వారీగా, ఎవరే సిలిండర్ వినియోగిస్తున్నారనే వివరాల నివేదిక ఉన్నతాధికారులకు పంపించాం. దీపావళి నుంచి ఉచిత సిలిండర్ల పథకం అమలవుతుంది.

- ఇస్మాయిల్, మండల పౌర సరఫరాలశాఖ అధికారి

## పవన్‌కల్యాణ్ ఆదేశాలతో సిమెంటు రోడ్డు నిర్మాణం



**గొల్లప్రోలు, న్యూస్‌టుడే:** గొల్లప్రోలు పీహెచ్‌సీకి వెళ్లే మార్గంలో సిమెంటు రోడ్డు నిర్మాణ పనులు రూ.4 లక్షలతో చేశారు. ఇదివరకు ఈ మార్గం బురదమయంగా ఉండడంతో పీహెచ్‌సీకి వెళ్లే రోగులు పడుతున్న ఇబ్బందులను ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కార్యాలయ అధికారులు ఇటీవల తెలుసుకుని నివేదించారు. వెంటనే రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని పవన్‌కల్యాణ్ జిల్లా కలెక్టరును ఆదేశించారు. కలెక్టరు ఆదేశాలపై మండల పరిషత్ సాధారణ నిధులతో సిమెంటు రోడ్డు నిర్మించారు. పనులను ఎంపీడీవో స్వప్న, ఎంపీపీ అచ్చియమ్మ, ఇంజినీరింగ్ అధికారులు శుక్రవారం పరిశీలించారు. ఇబ్బందులు తొలగాయని రోగులు, సిబ్బంది ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## సందడిగా సాంకేతిక విద్యా ఉత్సవాలు



బహుమతులు పొందిన విద్యార్థులతో నిర్వాహకులు

**గొల్లప్రోలు:** చేబ్రోలులోని ఆదర్శ్ ఇంజినీరింగ్ కళాశాలలో సాంకేతిక విద్యా ఉత్సవాలు రెండో రోజు శుక్రవారం కొనసాగాయి. నిరవధికంగా జరిగిన 24 గంటల హ్యాకథాన్‌లో భాగంగా విద్యార్థులు స్వయంగా విభిన్న రూపాల్లో తయారు చేసిన ప్రాజెక్టులను ప్రదర్శించారు. కళాశాల ఛైర్మన్ బుర్రా అనుబాబు, ప్రిన్సిపాళ్లు వి. శ్రీనివాసరావు, వైవీఎస్ రాజశేఖర్, కరస్పాండెంట్ అనురాధ పాల్గొన్నారు.

## జగనన్నకాలనీ.. దారి కావాలనీ..



శ్రీనివాస్‌కు వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

**గొల్లప్రోలు, న్యూస్‌టుడే:** గొల్లప్రోలులోని జగనన్నకాలనీకి వెళ్లేందుకు దారిలేక ఇబ్బందులు పడుతున్నామని, వంతెన నిర్మించి శాశ్వతంగా సమస్య పరిష్కారానికి చర్యలు చేపడుతున్న నేపథ్యంలో తాత్కాలిక రహదారి ఏర్పాటు చేయాలని ఆ ప్రాంత ప్రజలు కోరారు. ఈ మేరకు చేబ్రోలులోని పవన్‌కల్యాణ్ నివాసంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి మర్రెడ్డి శ్రీనివాస్‌ను జగనన్నకాలనీ వాసులు శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఇళ్లస్థలాలు కేటాయించి నాలుగేళ్లయ్యిందని, గృహాలు నిర్మించుకుని మూడేళ్లుగా నివాసం ఉంటున్నామన్నారు. కాలనీకి వెళ్లే దారిలో సుద్దగెడ్డపై కాజ్ వే, మార్గం చిన్నపాటి వర్షానికే ముంపునకు గురవుతోందన్నారు. జగనన్నకాలనీ నుంచి ప్రత్యేక మార్గంగా ఉన్న పుంత రోడ్లు, కాలువగట్టు మార్గంలో ఏదైనా ఒక దానిని అభివృద్ధిపరిచి రాకపోకలకు అవకాశం కల్పించాలని వినతి పత్రంలో కోరారు. సమస్యను పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకువెళతానని మర్రెడ్డి శ్రీనివాస్ వారికి తెలిపారు. దండు వీరబాబు, సీహెచ్ శ్రీనివాస్, గణేష్, శివ, సత్యప్రసాద్, డానియేలు, వెంకటరమణ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## దివంగత ఎమ్మెల్యేకు నివాళి

**సర్పవరం జంక్షన్:** స్వాతంత్ర సమరయోధుడు, కమ్యూనిస్ట్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే దివంగత వంకా సత్యనారాయణ జీవితాంతం పేదలకు అండగా నిలిచారని చింతపల్లి సుబ్బారావు పేర్కొన్నారు. రమణయ్యపేటలో శుక్రవారం సత్యనారాయణ వర్ధంతిని పురస్కరించుకుని నివాళి అర్పించారు. ఆయన మనవడు డా.అడ్డాల సత్యనారాయణ, జానకీరమ 200 మంది పేదలకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు.

## 28 మందికి ఉద్యోగాలు

**పిఠాపురం:** పిఠాపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్కిల్ డవలప్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో మినీ ఉద్యోగ మేళా శుక్రవారం నిర్వహించారు. ముఖాముఖికి 93 మంది హాజరయ్యారు. మూడు కార్పొరేట్ కంపెనీల్లో 28 మంది ఉద్యోగ అవకాశాలు దక్కించుకున్నారు. ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ ప్రేమ్‌కుమార్, స్కిల్ డవలప్‌మెంట్ సంస్థ అధికారి శ్యామ్, కోఆర్డినేటర్ రేవతి, ప్రిన్సిపల్ సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా వ్యాపారులను ప్రోత్సహించాలి

**పిఠాపురం:** మహిళా వ్యాపారులను ప్రతిఒక్కరూ ప్రోత్సహించాలని, వారు తయారుచేసిన సామగ్రి కొనుగోలు చేయాలని మెప్మా సీఎంఎం వెంకటలక్ష్మి కోరారు. పిఠాపురంలోని కార్యాలయం వద్ద శుక్రవారం మెప్మా అర్బన్ మార్కెట్(బజారు) నిర్వహించారు. ఆహార ఉత్పత్తులు, సబ్బులు, ఫినాయిల్, దుస్తులు తదితరాలు తక్కువ ధరకు విక్రయించారు. మెప్మా సిబ్బంది ఉమ, శైలజ, శ్రీవల్లీ తదితరులు పాల్గొన్నారు.

## నీటి వృథా ఆగింది..

ఈనాడు కథనానికి స్పందన



మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

**పెద్దాపురం:** పెద్దాపురం పురపాలిక కార్యాలయం ఎదుట తాగునీటి పైపులైను లీకేజీల నివారణకు శుక్రవరం చర్యలు చేపట్టారు. ఈ నెల 23న 'ఈనాడు'లో 'రోడ్డున జలం.. కలుషితమయ్యే ప్రమాదం' శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు.

## ఉద్యాన స్థలం అధ్వానం



పిఠాపురంలోని మాధవపురం రోడ్డులోని పద్మావతినగర్‌కు వెళ్లే మార్గంలోని మున్సిపాలిటీ పార్కు స్థలం అధ్వానంగా ఉంది. గతంలో ఈ ప్రదేశాన్ని కొందరు ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. దాంతో అధికారులు వాటిని తొలగించారు. అప్పటి నుంచి పార్కు స్థలం నిరుపయోగంగా ఉంది. దాని చుట్టూ ప్రహరీసైతం శిథిలావస్థకు చేరుకుంది. వర్షం పడితే నీరు నిలిచి చెరువును తలపిస్తుంది. మరోపక్క పార్కు చుట్టూ పిచ్చి మొక్కలు మొలిచి చిట్టడివిలా కనిపిస్తోంది. దాంతో పాములు సంచరించే ప్రమాదం పొంచిఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కమిషనర్ కనకారావును అడుగగా పార్కుల అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేశామని, నిధులు కేటాయించి, అభివృద్ధి చేస్తామని చెప్పారు.

- న్యూస్‌టుడే, పిఠాపురం



## మేమున్నాం.. మీకు తోడుగా

**సమస్య:** పిఠాపురంలోని ఉప్పాడ బస్టాండు సెంటర్‌లో రహదారి గతుకులమయంగా మారింది. రాకపోకలకు అవస్థలు పడుతున్నాం. వర్షం పడితే నీరు నిలిచి ఇబ్బందిగా మారుతోంది.

- రాజేష్, స్టువార్టుపేట

**పరిష్కారం:** ఉప్పాడ సెంటర్‌లో గోతుల దారికి తాత్కాలికంగా మరమ్మతులు చేశాం. సిమెంటు బూడిద, కంకర వేసి పూడ్చాం. రోడ్డు నిర్మాణానికి కూడా సంబంధిత అధికారులకు సమాచారం ఇస్తాం.

- కనకారావు, కమిషనర్

**గుంతల రహదారితో ఇక్కట్లు**

**సమస్య:** పెద్దాపురం నుంచి రాజమహేంద్రవరం, కాకినాడ వెళ్లే రహదారులు గుంతలతో ప్రమాదకరంగా ఉన్నాయి. అధికారులు చర్యలు తీసుకోవాలి.

- మురళీకృష్ణ, పెద్దాపురం

**సమాధానం:** రాజమహేంద్రవరం వెళ్లే ఏడీబీ రహదారి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. కాకినాడ రహదారిలో గుంతలు పూడ్చడానికి చర్యలు తీసుకుంటాం.

- రాఘవరావు, ఈఈ, ర.భ.శాఖ, పెద్దాపురం

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు:

కాకినాడ గ్రామీణం: 80085 74325

పెద్దాపురం: 80085 74198

పిఠాపురం: 80085 65544

- న్యూస్‌టుడే, పిఠాపురం, పెద్దాపురం

## ప్రమాద అంచుల్లో ప్రయాణం



చదువుల మాట అటుంచితే ఏమాత్రం కాలుజారి కిందపడినా ప్రాణాపాయం తప్పని తీరుకు ఈ చిత్రం నిదర్శనంగా నిలుస్తోంది. గండేపల్లి మండలం సూరంపాలెం దారిలో ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలు ఉండడంతో విద్యార్థులు ప్రతిరోజూ కాకినాడ, సామర్లకోట, పెద్దాపురం, పిఠాపురం మండలాల నుంచి ఆర్టీసీ బస్సుల్లో రాకపోకలు సాగిస్తుంటారు. ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉండే సామాన్య, మధ్యతరగతికి చెందిన వందలాది మంది ఆర్టీసీ బస్సుల్లో కళాశాలలకు వస్తారు. ప్రతిరోజూ ఉదయం 8 నుంచి 9 గంటల వరకు పెద్దాపురం నుంచి రాజమహేంద్రవరం వెళ్లే ఆర్టీసీ బస్సుల్లో ఈ పరిస్థితి ఉంటుంది. పెద్దాపురం నుంచి రాజానగరం మీదుగా రాజమహేంద్రవరం వెళ్లే మార్గంలో బస్సులు తక్కువగా ఉండడంతో వేలాడుతూ ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది. ప్రత్యేకంగా మూడు బస్సులు ఉదయం నడపాలని విద్యార్థులు కోరుతున్నారు. ఆర్టీసీ డిపో మేనేజర్ మనోహర్‌ను అడగగా పెద్దాపురం నుంచి రాజానగరం మీదుగా రాజమహేంద్రవరానికి బస్సులు బాగానే ఉన్నాయని, విద్యార్థులకోసం ప్రత్యేకంగా బస్సు సర్వీసుకోసం ఉన్నతాధికారులకు తెలుపుతామన్నారు.

- న్యూస్‌టుడే, పెద్దాపురం

## భూ సమస్యల పరిష్కారం

**కరప, పెదపూడి, సామర్లకోట గ్రామీణం, తాళ్లరేవు:** భూ సమస్యల సత్వర పరిష్కారం నిమిత్తం ప్రభుత్వం నిర్వహిస్తోన్న గ్రామసభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు నందిపాటి సత్యనారాయణ కోరారు. కూరాడలో శుక్రవారం ఆయన సభ నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. డీటీ దుర్గాప్రసాద్, మండల సర్వేయర్ రూపవతి, వీఆర్వో శ్రీనివాస్ పాల్గొన్నారు. ● చింతపల్లిలో తహసీల్దారు సీతాపతిరావు ఆధ్వర్యంలో శుక్రవారం రెవెన్యూ గ్రామసభ జరిగింది. ● ఉండూరు శివారు మామిళ్లదొడ్డి పరిధిలో శుక్రవారం రీసర్వే గ్రామసభ తహసీల్దారు చంద్రశేఖర రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. 26 దరఖాస్తులు వచ్చాయి. డీటీ శ్రీనివాస్, మండల సర్వేయర్ సీతారామచార్యులు పాల్గొన్నారు. ● తాళ్లరేవు మండలం ఉప్పంగల పంచాయతీ వద్ద రీ సర్వే సమస్యలపై రెవెన్యూ గ్రామసభ శుక్రవారం నిర్వహించారు. తహసీల్దారు పితాని త్రినాథ్ రైతుల నుంచి 133 దరఖాస్తులు స్వీకరించారు. ● కాజులూరు: తహసీల్దారు శివకుమార్ ఆర్యవటంలో సభ నిర్వహించారు.



## రుణాలతో ఆర్థికాభివృద్ధి సాధించండి

**పెద్దాపురం:** ప్రభుత్వాలు అందించే రుణాలను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని పెద్దాపురం పురపాలిక కమిషనర్ పద్మావతి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణ మహిళా సమాఖ్య సభ జరిగింది.

## భక్తులకు అన్నదానం

**తాళ్లరేవు:** పి.మల్లవరం పంచాయతీ పరిధిలోని గ్రాంటు పాలకనకదుర్గమ్మ ఆలయం వద్ద శరన్నవరాత్రుల మహోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఆలయ అర్చకులు రాయప్రోలు కామేశ్వరశర్మ, గ్రాంటు భక్తుల ఆధ్వర్యంలో ఆలయం వద్ద శుక్రవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## ప్రమాదవశాత్తు జారిపడి వ్యక్తి మృతి

**పిఠాపురం:** కందరాడలోని బాలాజీ రైస్ మిల్లులో పనిచేస్తుండగా పుట్టి వెంకటరమణ(36) ప్రమాదవశాత్తు జారిపడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పసలపూడికి చెందిన వెంకటరమణ శుక్రవారం షెడ్డు నిర్మాణ పని చేస్తుండగా ఘటన జరిగింది. గ్రామీణ ఎస్సై గుణశేఖర్ మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

## యువకుడి బలవన్మరణ యత్నం

**సర్పవరం జంక్షన్:** తమ్మవరం గ్రామానికి చెందిన వీరవల్లి శివకుమార్(38) అప్పుల బాధ తాళలేక శుక్రవారం పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. చికిత్స నిమిత్తం అతన్ని కాకినాడ సర్వజన ఆసుపత్రికి తరలించారు. ఘటనపై ఎలాంటి ఫిర్యాదు నమోదు కాలేదని తిమ్మాపురం పోలీసులు తెలిపారు.

## వాహనం ఢీకొని వాచ్‌మెన్ దుర్మరణం

**శేరిలింగంపల్లి(హైదరాబాద్):** గుర్తుతెలియని వాహనం ఢీకొని వాచ్‌మెన్ మృతి చెందిన ఘటన హైదరాబాద్‌లోని చందానగర్ ఠాణా పరిధిలో జరిగింది. ఎస్సై సంధ్య వివరాల ప్రకారం.. పెద్దాపురం మండలం చెదలాడ గ్రామానికి చెందిన మోటుకూరి వీరబాబు(36) భార్య సుబ్బలక్ష్మి, ఇద్దరు పిల్లలతో పదేళ్ల క్రితం నగరానికి వచ్చాడు. వాచ్‌మెన్‌గా పనిచేస్తూ మియాపూర్ దీప్తి శ్రీనగర్‌లో ఉంటున్నాడు. గురువారం పనిమీద బయటికి వచ్చిన అతను తిరిగి ఇంటికి వెళ్లలేదు. అర్ధరాత్రి చందానగర్ పోలీసులు సుబ్బలక్ష్మికి ఫోన్ చేసి వీరబాబు ప్రమాదానికి గురయ్యారని చెప్పారు. గాంధీ ఆసుపత్రిలో చేర్చగా చికిత్సపొందుతూ శుక్రవారం తెల్లవారుజామున చనిపోయాడు.

## సారా స్థావరంపై దాడి

**కొత్తపల్లి:** కొత్తమూలపేట శివారులో సారా స్థావరంపై శుక్రవారం కొత్తపల్లి పోలీసులు దాడి చేశారు. అక్కడున్న 500 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి పది లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. అనుసూరి శ్రీను అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని తెలిపారు.

## ఉద్యోగ భద్రతకు ఆందోళన

**గొల్లప్రోలు:** వాలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, వేతన బకాయిలు చెల్లించాలని, రాజీనామా చేసినవారిని సైతం కొనసాగించాలని ఆందోళన చేశారు. చేబ్రోలులో ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు వాలంటీర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. సీఐటీయూ నాయకుడు నందేశ్వరరావు, ప్రకాష్, అప్పారావు, కుమార్, ఉమాదేవి, నాగమణి పాల్గొన్నారు.

## ఉజ్వల భవిత

**కరప:** క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిత చేకూరుతుందని సామాజిక సేవా కార్యకర్త పోలిశెట్టి నారయ్య అన్నారు. ఇటీవల తూర్పుగోదావరి అండర్-16 జట్టుకు కెప్టెన్‌గా ఎంపికైన పెదకొత్తూరుకు చెందిన అడపా శ్రీనివాస్‌కు ఎన్నారై పులి రామలింగేశ్వరరావును ఇచ్చిన రూ.16 వేలతో క్రికెట్ కిట్‌ను నారయ్య కరపలో శుక్రవారం అందజేశారు.

## బాణసంచా స్వాధీనం

**సర్పవరం జంక్షన్:** కాకినాడ గ్రామీణం తూరంగి గ్రామానికి చెందిన మద్దాల వెంకటేశ్వరరావు కిరాణాషాపులో తణుకు తదితర ప్రాంతాల నుంచి తక్కువ ధరకు బాణసంచా కొనుగోలు చేసి దీపావళికి అమ్మేందుకు నిల్వ చేశాడు. అనుమతులు లేకుండా నిల్వచేసిన రూ.1,11,000 విలువైన బాణసంచాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఇంద్రపాలెం ఎస్సై వీరబాబు తెలిపారు.

## దుకాణాల ఏర్పాటుకు సమావేశం

**పెదపూడి:** మండలంలో దీపావళికి బాణా సంచా దుకాణాలు ఏర్పాటుకు విధివిధానాలు తహసీల్దారు సీతాపతిరావు వివరించారు. వీఆర్వో, పంచాయతీ కార్యదర్శులకు శుక్రవారం సమావేశం ఏర్పాటు చేసి నియమావళిని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో నరేంద్రరెడ్డి పాల్గొన్నారు.


## ఉత్సాహంగా వ్యాసరచన పోటీలు

**సర్పవరం జంక్షన్:** పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం బెటాలియన్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో సైబర్ క్రైం-యువత పాత్ర అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కమాండెంట్‌లు రామకృష్ణ, దేవానందరావు, మురళీకుమార్, ఇతర అధికారులు పరిశీలించారు.

## ఉత్తమ పౌరులుగా ఎదగండి

**పెదపూడి, న్యూస్‌టుడే:** గొల్లలమామిడాడలోని జడ్పీ ఉన్నత (బాలుర) పాఠశాలను శుక్రవారం జిల్లా ఉప విద్యాశాఖాధికారి కె.వి.వి. సత్యనారాయణ ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులు నైతిక ప్రవర్తన కలిగి ఉండాలని, ఉత్తమ పౌరులుగా ఎదగాలని వారిని సూచించారు.

## లక్ష్యాల మేరకు ఉపాధి పనులు



మాట్లాడుతున్న డ్వామా ఏపీడీ వసంతమాధవి

**గొల్లప్రోలు:** లక్ష్యాల మేరకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు నిర్వహించాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) ఏపీడీ వసంతమాధవి ఆదేశించారు. గొల్లప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో స్వప్నతో కలిసి ఉపాధి హామీ పథకం అధికారులు, సిబ్బందికి శుక్రవారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. ఏపీవో కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

# జంతు కొవ్వు స్వాధీనం.. కలకలం



పిఠాపురంలో ఓ ఇంట్లో నిల్వ చేసిన జంతు కొవ్వు

**పిఠాపురం, న్యూస్‌టుడే:** పిఠాపురంలో నూనె తయారీకి వినియోగించే జంతు కొవ్వును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కొంతకాలంగా గుట్టుచప్పుడు కాకుండా ఇళ్లలో సాగుతున్న ఈ వ్యవహారం ఎట్టకేలకు బయటపడింది. దీపారాధనకోసం కల్తీ నూనె తయారు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. రాష్ట్రంలో ఇటీవల జంతు మాంస అవశేషాలతో నెయ్యి తయారీ కలకలం నేపథ్యంలో పిఠాపురంలోనూ ఘటన వెలుగుచూడడం చర్చనీయాంశంగా మారింది. ఆధ్యాత్మికంగా ప్రాధాన్యం ఉన్న ఈ ప్రాంతంలో జంతు కొవ్వుతో నూనె తయారీ దుమారం రేగుతోంది.

**అధికారుల నిర్లక్ష్యం..**

పిఠాపురంలో రెండు నెలలుగా కొవ్వు నుంచి నూనె తయారు చేస్తున్నా.. అధికారులు పసిగట్టలేకపోవడం అనుమానాలకు తావిస్తోంది. గతంలో పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకుని, కల్తీ నెయ్యి తయారీదారులపై కేసులు కూడా నమోదు చేశారు. అయినప్పటికీ తయారీ ఆగలేదని, ఇక్కడి నుంచి డబ్బాల్లో ఇతర ప్రాంతాలకు పంపిస్తుంటారనే ఆరోపణలున్నాయి.

**కమిషనర్ తనిఖీలు..**

జంతు కొవ్వు, కల్తీ నెయ్యి తయారీ గురించి సామాజిక మాధ్యమం ద్వారా తెలుసుకున్న పురపాలిక కమిషనర్ కనకారావు, పోలీసులు మాధవపురం రోడ్డులోని పద్మావతినగర్‌లో శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. బండారు ఫణిప్రసాద్ భార్య ధనశ్రీ, తల్లి కుమారి ఇంట్లో సోదాలు నిర్వహించారు. వారి ఇంట్లోని ఓ గదిలో 12 టిన్నుల్లో 130 కేజీలు, మరో గిన్నెలో 135 కిలోల జంతు కొవ్వును స్వాధీనం చేసుకున్నారు. దానిని వేడి చేసి నూనె, నెయ్యిగా మార్చే పొయ్యి, ఇతర సామగ్రిని సీజ్ చేశారు. చట్టవిరుద్ధంగా చేస్తున్నారని గుర్తించారు.

**దీపారాధన నూనెగా గుర్తించాం..**

కొవ్వును గుర్తించి కాకినాడలోని ఆహార తనిఖీ అధికారులకు సమాచారం ఇచ్చాం. ఇక్కడ కొవ్వు నుంచి దీపారాధనకోసం వినియోగించే నూనె తయారు చేస్తున్నట్లు గుర్తించాం. కల్తీ నెయ్యి ఆనవాళ్లు ఏమీ లేవు. ఆహార తనిఖీ అధికారులు ఇచ్చిన నివేదిక ఆధారంగా వారిపై కేసులు నమోదు చేస్తాం.

- నామా కనకారావు, కమిషనర్, పిఠాపురం పురపాలిక

# తుని

•తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట

## రేపటి నుంచి సత్యదీక్షలు

**అన్నవరం:** అన్నవరం సత్యనారాయణ స్వామి దీక్షలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. గిరిజన ప్రాంతాల్లోని వారికి దేవస్థానం నుంచి దీక్షావస్త్రాలు అందజేశారు. సత్యదేవుని క్షేత్ర రక్షకులు వనదుర్గ అమ్మవారి ఆలయంలో శుక్రవారం చండీ హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెదపులిపాక విజయ రాజ రాజేశ్వరీ శ్రీవిద్యాపీఠం పీఠాధిపతి వాసుదేవానందగిరి స్వామి సత్యదేవుని దర్శించుకున్నారని అధికారులు తెలిపారు.

## ఏలేశ్వరంలో మహాన్నదానం

**ఏలేశ్వరం:** ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద శుక్రవారం మహాన్నదానం ఏర్పాటుచేశారు. శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమానికి భాజపా జిల్లా ఉపాధ్యక్షుడు ఉమ్మిడి వెంకట్రావు 200 కిలోల బియ్యం, వంట నూనెను సమకూర్చారు. భక్తులకు ఆయన ప్రసాదాన్ని వడ్డించారు.

## పామాయిల్ సాగు విస్తీర్ణం పెంచాలి



మాట్లాడుతున్న జిల్లా అధికారి మల్లికార్జునరావు

**తుని గ్రామీణం:** పామాయిల్ సాగుకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీని సద్వినియోగం చేసుకొని రైతులు పామాయిల్ సాగుపై ప్రత్యేక దృష్టిసారించాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి మల్లికార్జున రావు సూచించారు. శుక్రవారం మండల మహిళా సమైఖ్య కార్యాలయంలో రైతు సేవాకేంద్రం సిబ్బందికి పామాయిల్ సాగులో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ ఏడాది తుని నియోజకవర్గ పరిధిలో సుమారు అయిదు వేల ఎకరాల విస్తీర్ణంలో పామాయిల్ సాగు విస్తీర్ణం పెంచేందుకు చొరవ చూపాలని తెలిపారు.

## సత్తా చాటి.. బహుమతులు సాధించి..



పోటీల్లో చక్కా సూర్యనారాయణ పాఠశాల విద్యార్థులు

తుని, న్యూస్‌టుడే: పట్టణంలోని సీతారాంపురంలో ఉన్న శ్రీ చక్కా సూర్యనారాయణ పురపాలక ఉన్నత పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో వ్యాస రచన పోటీలు శుక్రవారం జరిగాయి. వివిధ తరగతుల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అన్న అంశంపై తమ అభిప్రాయాలు వెల్లడించారు. పాఠశాల ఉపాధ్యాయులు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించి ప్రతిభచూపిన వారిని ఎంపిక చేశారు. పోటీల్లో బి.చరిష్మా (మొదటి), కె.రజిని (ద్వితీయ), ఎస్.లాస్య (తృతీయ) దక్కించుకోగా వీరికి హెచ్ఎం కెఎస్‌వి సూర్యనారాయణ, ఉపాధ్యాయిని వి.శ్రీదేవి బహుమతులు, ధ్రువపత్రాలు అందజేశారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

# సొంత భవనాలు సమకూరేనా..!

### ● అరకొర వసతుల మధ్య కేంద్రాలు

శంఖవరం, రౌతులపూడి, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు మెరుగైన విద్య, ఆహారం అందిస్తున్నప్పటికీ సొంత భవనాలు లేకపోవడంతో వసతులకు ఇబ్బందులు తప్పడం లేదు. శంఖవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధి రౌతులపూడి, శంఖవరం మండలాల్లో 116 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 53 ప్రభుత్వ భవనాలు, 2 ఉచిత వసతుల్లో నిర్వహిస్తుండగా 61 కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. గత ప్రభుత్వం 'నాడు-నేడు'లో పూర్తి స్థాయిలో నిధులు విడుదల చేయకపోవడంతో ఈ నిర్మాణాలు అసంపూర్తిగా మిగిలాయి. దీంతో చిన్నారుల్లో సృజనను పెంపొందించేలా పరికరాలను ఉపయోగిస్తూ బోధించడం కుదరడం లేదు. కూటమి ప్రభుత్వంలోనైనా ఈ భవనాలను ఏర్పాటు చేసి ఆహ్లాదకర బోధనకు వీలు కలుగుతుంది.

**శంఖవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధి**

| మండలం | రౌతులపూడి | శంఖవరం |
|---|---|---|
| మొత్తం కేంద్రాలు | 59 | 57 |
| ప్రభుత్వ భవనాలు | 35 | 18 |
| అద్దె భవనాలు | 23 | 38 |
| ఉచితవసతి | 01 | 01 |
| అరెళ్లలోపు చిన్నారులు | 2735 | 3318 |
| గర్భిణులు బాలింతలు | 394 | 319 |
| బాలింతలు | 300 | 307 |



లచ్చిరెడ్డిపాలెంలో అసంపూర్తిగా అంగన్‌వాడీ భవనం

**ఉన్నతాధికారులకు నివేదించాం**

శంఖవరం ప్రాజెక్టు పరిధిలోని అవసరాలను గుర్తించాలని ఇప్పటికే కూటమి ప్రభుత్వం ఆదేశించింది. మా ప్రాజెక్టు పరిధిలోని అవసరాలు, పరిస్థితులపై ఉన్నతాధికారులకు సమగ్ర నివేదిక అందజేశాం.

- పద్మావతి, సీడీపీవో, శంఖవరం

## దుర్గామీనాక్షి ఆలయంలో పూజలు



దుర్గామీనాక్షి అమ్మవారు

శంఖవరం, న్యూస్‌టుడే: సీతంపేట దుర్గామీనాక్షి అమ్మవారి ఆలయంలో శుక్రవారం కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కత్తిపూడి కనకదుర్గమ్మ ఆలయం వద్ద భారీ అన్నదాన కార్యక్రమం జరిగింది.

### అమ్మా.. భోజనం బాగుంటుందా..?



అన్నక్యాంటీన్‌లో వడ్డిస్తున్న ఎమ్మెల్యే దివ్య

తుని పట్టణం, న్యూస్‌టుడే: అమ్మా భోజనం బాగుందా? పదార్థాలు రుచికరంగా ఉన్నాయా.. అంటూ ఎమ్మెల్యే యనమల దివ్య ఆరా తీశారు. పట్టణంలోని రాజ బాబు పార్కులో ఉన్న అన్నా క్యాంటీన్‌ను ఆమె శుక్రవారం పరిశీలించారు. అక్కడ భోజనాలు చేస్తున్న వారితో ముచ్చటించారు. ఆమె స్వయంగా ఆహార పదార్థాలు వడ్డించారు. నాయకులు యనమల రాజేష్, యినుగంటి సత్యనారాయణ, కుసుమంచి శోభారాణి, కమిషనర్ ఎ.వెంకట్రావు తదితరులు ఉన్నారు.

## మేమున్నాం.. మీకు తోడుగా

### పైపులైనుకు మరమ్మతులు

**జగ్గంపేట గ్రామీణం:** సీతారాంపురంలో పైపులైనుకు లీకులు ఏర్పడి నీరు వృథాగా పోతుంది. శివారుకాలనీలకు నీరు అందక, వర్షాలు వస్తున్నా వారు యని పలువురు వాపోతున్నారు. సమస్యను సర్పంచి విష్ణుమూర్తి దృష్టికి తీసుకెళ్లగా సిబ్బందితో పైపులైనుకు మరమ్మతులు చేపట్టి లీకులను అరికట్టారు.

### చెత్త తొలగించారు

**శంఖవరం:** జి.కొత్తపల్లి గ్రామంలో ప్రధాన రహదారికి ఇరువైపులా చెత్త పేరుకుపోయి దుర్వాసన, రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. సమస్యను సర్పంచి విజయదుర్గ వద్ద ప్రస్తావించగా సిబ్బందితో శుభ్రం చేయించారు.

స్పందనకు స్పందనం

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: తుని: 9100020946, ప్రత్తిపాడు: 98669 62946 జగ్గంపేట: 80086 22066

## భూహక్కుల కోసం ధర్నా

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: మండలంలోని వెంకటనగరం గ్రామంలో భూములు సాగుచేసుకుంటున్న పేదలకు హక్కులు కల్పించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ప్రదర్శన, పంచాయతీ ముందు ధర్నా జరిగింది. సి.పి.ఐ(ఎంఎల్)లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు మానుకొండ లత్సుబాబు, సంఘ నాయకులు బండి సూరిబాబు, ముప్పిడి అప్పలకొండ, నూకరాజు, వీరబాబు నాయకత్వం వహించారు. వైకాపా ప్రభుత్వం డ్రోన్ సర్వే చేసి హక్కులు కల్పిస్తామని చెప్పి మోసం చేసిందని ఆరోపించారు. గ్రామంలో సమగ్ర సర్వే జరిపి గిరిజనులు, పేదల సాగులో ఉన్న భూములకు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. గ్రామసభలో వినతిపత్రం అందజేశారు.

### డిసెంబరు 4న ప్రజాహక్కుల ర్యాలీ

**జగ్గంపేట గ్రామీణం:** కేంద్ర, రాష్ట్రప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ డిసెంబరు 4న సీపీఐ(ఎం.ఎల్)లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించనున్న ప్రజాహక్కుల ర్యాలీని జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను నిరసిస్తూ మండలంలోని గోవిందపురంలో ర్యాలీ నిర్వహించారు. అర్జునరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలముందు ప్రజలకు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను అమలుచేయకుండా కేవలం పింఛన్లు మాత్రమే ఇస్తూ కాలయాపన చేస్తున్నారన్నారు. జగ్గంపూడి రాజు, నాగులపల్లి అప్పారావు, మురద మంగయమ్మ, రొబ్బల సంకురమ్మ, నాగేశ్వ, సత్యవతి పాల్గొన్నారు.



గోవిందపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ(ఎం.ఎల్)లిబరేషన్ నాయకులు

## గంజాయి నియంత్రణకు ప్రత్యేక దృష్టి

**తుని గ్రామీణం, న్యూస్‌టుడే:** తుని ప్రాంతం ఏజెన్సీకి దగ్గరగా ఉండటంతో పలువురు ద్విచక్రవాహనాలపై తక్కువ మొత్తంలో గంజాయిని తరలించి గ్రామాల్లోని యువతకు విక్రయిస్తున్నట్లు సమాచారం ఉందని ఏలూరు రేంజ్ డీఐజీ జీజీ అశోక్‌కుమార్ తెలిపారు. దీన్ని నివారించేందుకు ప్రత్యేక దృష్టి సారించామన్నారు. శుక్రవారం తుని రూరల్ సర్కిల్ కార్యాలయంలోని దస్త్రాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. ఈ సర్కిల్ పరిధిలో ఎన్‌హెచ్ ఉండటంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని దీని కోసం పోలీసు, ఆర్టీఏ అధికారులు బ్లాక్‌స్పాట్లు గుర్తించి నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందించనున్నారు. ఎన్‌హెచ్ వెంబడి సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. రహదారి వెంబడి వ్యభిచారం పెరగడంతో కొన్ని అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకున్నాయని వాటిని పూర్తిగా నివారించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు, సీఐ చెన్నకేశవరావు సిబ్బంది పాల్గొన్నారు.

### లోవ తలుపులమ్మకు పూజలు



పూజలు చేస్తున్న ఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ విక్రాంత్‌పాటిల్

**తుని గ్రామీణం:** ప్రముఖ పుణ్యక్షేత్రం తలుపులమ్మ లోవ దేవస్థానాన్ని పోలీసు ఉన్నతాధికారులు సందర్శించారు. శుక్రవారం మధ్యాహ్నం ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్, జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్, పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు తదితరులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానం అధికారులు వారికి సాదరంగా స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు అనంతరం దేవస్థానం వేదపండితులు వారికి ఆశీర్వచనాలు చేసి ప్రసాదం, అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు.

## రీసర్వే సమస్యలపై గ్రామసభ

**కిర్లంపూడి, గండేపల్లి:** కిర్లంపూడి గ్రామంలో రీసర్వే సమస్యలపై స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామసభను శుక్రవారం నిర్వహించారు. సమావేశంలో తహసీల్దారు జె.చిరంజీవి మాట్లాడుతూ.. పదిమంది రైతులు అర్జీలను అందజేశారన్నారు. తాళ్లూరులో శుక్రవారం జరిగిన గ్రామసభలో 35 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దారు శ్రీనివాస్ తెలిపారు.

## ప్రతి అభ్యర్థి ఉద్యోగం సాధించాలి

గండేపల్లి(జగ్గంపేట)న్యూస్‌టుడే: డీఎస్సీ శిక్షణ తీసుకునే ప్రతి అభ్యర్థి ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో సాధన చేయాలని జిల్లా తెదేపా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్ అన్నారు. శుక్రవారం జగ్గంపేటలోని కాపుకల్యాణ మండపంలో జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణను నవీన్‌కుమార్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ..110 రోజులపాటు జరిగే ఈ ఉచిత డీఎస్సీ శిక్షణను సద్వినియోగం చేసుకుని ప్రతి అభ్యర్థి ఉద్యోగం సాధించి తల్లిదండ్రులకు, నియోజకవర్గానికి పేరు తీసుకురావాలన్నారు. ముందుగా సరస్వతీదేవి, సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటాలకు పూలదండలు వేసి, జ్యోతిప్రజ్వలన చేసి కోచింగ్ ప్రారంభించారు. నాయకులు అప్పలరాజు, భద్రం, మణిబాబు, మోహనరావు, చిట్టిబాబు, బాబ్జి తదితరులు పాల్గొన్నారు.



శిక్షణను ప్రారంభించిన జ్యోతుల నవీన్‌కుమార్, తెదేపా నాయకులు

## పశుగణనకు ప్రజలు సహకరించాలి

**తుని గ్రామీణం, గండేపల్లి(జగ్గంపేట):** పశుగణనకు ప్రజలు, రైతులు పూర్తి సహకారం అందించాలని ఎమ్మెల్యే యనమల దివ్య సూచించారు. తేటగుంట పార్టీ కార్యాలయంలో పశుసంవర్ధకశాఖ అధికారుల సమక్షంలో ఆమె పశుగణన గోడపత్రికను ఆవిష్కరించారు. 2025 ఫిబ్రవరి 28లోగా ఈ కార్యక్రమాన్ని పూర్తిచేసి నివేదికను ప్రభుత్వానికి అందజేయనున్నారు. ● జగ్గంపేటలో పశువైద్యుల అధికారుల ఆధ్వర్యంలో తెదేపా జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్ కరపత్రాలను ఆవిష్కరించారు.

## ఎ.కొత్తపల్లి విద్యార్థినికి తృతీయ బహుమతి



కాకినాడలో కలెక్టర్ నుంచి మెమెంటో అందుకుంటున్న విద్యార్థిని

**తొండంగి:** అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా 11న కాకినాడ డీఎంఅండ్‌హెచ్‌వో వారు 'బాలికను రక్షిద్దాం..బాలికను చదివిద్దాం' అంశంపై జిల్లా స్థాయిలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఎ.కొత్తపల్లి జడ్పీహెచ్ఎస్ పదో తరగతి విద్యార్థిని తొగరు పావని షణ్ముఖి తృతీయ బహుమతి సాధించారని హెచ్ఎం లక్ష్మిమాణిక్యం తెలిపారు. శుక్రవారం కాకినాడలో జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఆ విద్యార్థినికి రూ.రెండు వేల నగదు, ధ్రువపత్రం, మెమెంటో అందజేశారు.

## భక్తిశ్రద్ధలతో గంధోత్సవం



ఖురాన్ పఠనం చేస్తున్న ముస్లిం మహిళలు

**తుని:** హజరత్ మహబూబ్ సుభాని వారి గంధోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద దర్గా నిషానీ వద్ద ప్రార్థనలు చేసి బావుటా ఎత్తే కార్యక్రమం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. అనంతరం 14వ వార్డు ముస్లిం వీధిలోని దర్గా వద్ద ఖురాన్ పఠించారు. సాయంత్రం దర్గా కమిటీ, ఎంసీసీ యూత్ ఆధ్వర్యంలో సహపంక్తి భోజనాలు జరిగాయి.

## అడుగుకో గుంత.. తీరేనా చింత

**తుని గ్రామీణం:** ఎర్రకోనేరు నుంచి హంసవరం వెళ్లే రహదారిలో సుమారు అర కి.మీ. పొడవునా అడుగుకో గుంత ఉండటంతో ప్రయాణం అవస్థగా మారిందని వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆటోవాలాలు సైతం ఈ రహదారిపై రాకపోకలు నిలిపివేయడంతో స్థానికులకు అవస్థలు తప్పడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి కనీసం గోతులను పూడ్చేందుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



ఎర్రకోనేరు- హంసవరం వెళ్లే రహదారి

## క్లోరినేషన్ యంత్రాల ఏర్పాటు

**కిర్లంపూడి, న్యూస్‌టుడే:** జగపతినగరం పంచాయతీ పరిధిలోని నాలుగు తాగునీటి ఓవర్‌హెడ్ ట్యాంకు (ఓహెచ్ఎస్ఆర్)కు క్లోరినేషన్ యంత్రాలను శుక్రవారం అమర్చారు. ఈప్రాంతం రాతినేలలు కావడంతో నీటిలో శుద్ధ ప్రభావం ఎక్కువ. దీంతో ట్యాంకులను తరచూ క్లోరినేషన్ చేయాల్సిన పరిస్థితి. ప్రతిసారి ట్యాంకు పైకి ఎక్కి క్లోరినేషన్ చేసేందుకు సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ఈసమస్యను అధిగమించేందుకు ట్యాంకుకు బోరు నుంచి నీరు ఎక్కే ప్రధాన పైపులైనుకు క్లోరినేషన్ యంత్రాన్ని అమర్చారు. దీని వల్ల ట్యాంకు పైకి ఎక్కాల్సిన అవసరం లేకుండా కింద నుంచే మొత్తం నీరు క్లోరినేషన్ అయ్యేలా ఈ యంత్రం ఉపయోగపడుతుందని సాంకేతిక సిబ్బంది తెలిపారు. పంచాయతీ పరిధిలోని మిగిలిన ఓహెచ్ఎస్ఆర్, జీఎల్ఆర్‌లకు కూడా వీటిని అమర్చి ప్రజలకు ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేసిన నీటినే అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని సర్పంచి మహేంద్రాడ శ్రీలత తెలిపారు.



తాగునీటి ఓవర్‌హెడ్ ట్యాంకుకు అమర్చిన క్లోరినేషన్ యంత్రం

## అవీ ఇవీ అన్నీ

### సైబర్ మోసాలపై అవగాహన అవసరం

**గండేపల్లి, న్యూస్‌టుడే:** సైబర్ మోసాలపై ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలి, కుటుంబసభ్యులకు అవగాహన కల్పించాలని సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం సూరంపాలెం ఆదిత్య విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ.. అపరిచిత వ్యక్తులు వ్యక్తిగత డేటాను దొంగిలించి బెదిరింపులకు గురిచేస్తారని అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎస్సై శివనాగబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

### పట్టాలు ఇవ్వాలని వినతి

**రౌతులపూడి:** ఎస్.పైడిపాలకి చెందిన పలువురు గిరిజనులు తాము సాగు చేసుకుంటున్న కొండపోడుకు పట్టా ఇవ్వాలని ఉప తహసీల్దారు నరేష్‌కు వినతిపత్రం అందించారు. అక్రమంగా ప్రవేశించిన వారిని తొలగించి పట్టాలు ఇవ్వాలని శుక్రవారం విన్నవించుకున్నారు.

### జడ్పీ పాఠశాలలో వ్యాసరచన పోటీలు

**గండేపల్లి(జగ్గంపేట):** జగ్గంపేట జడ్పీ పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు ఎస్సై టి.రఘునాధరావు అన్నారు. ఆయన మాట్లాడుతూ.. పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. విజేతలకు వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో బహుమతులు అందజేయనున్నారు.

### బాణాసంచా దుకాణాలు ఏర్పాటు స్థలం పరిశీలన

**గండేపల్లి:** బాణాసంచా దుకాణాలు ఏర్పాటు చేసే స్థలంలో ప్రతీ దుకాణం వద్ద నీరు, ఇసుక డ్రమ్ములు, మంటలను ఆర్పే గ్యాస్ సిలిండర్లు ఉండాలని సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం నీలాద్రిరావుపేట శివారు బాణాసంచా దుకాణాలు ఏర్పాటు చేసే స్థలాన్ని పరిశీలించారు. అనంతరం దుకాణాలు ఏర్పాటు చేసేవారితో సమావేశమయ్యారు. ఎస్సై శివనాగబాబు, అగ్నిమాపక అధికారి లక్ష్మణరావు, తహసీల్దారు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### మధ్యాహ్న భోజనం నాణ్యత పెంచాలి

**తుని పట్టణం:** ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనం కోసం మరిన్ని నిధులు కేటాయించడంతోపాటు, నాణ్యతను తరచూ పర్యవేక్షించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు జి.రాము డిమాండ్ చేశారు. పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు.

## రోటరీ యువజనోత్సవాలు ప్రారంభం




లాప్‌టాప్ బహూకరిస్తున్న ప్రతినిధులు

**తుని:** రోటరీ ద్వారా విద్యార్థులు, యువతను ప్రోత్సహించడానికి రంగం-2024 పేరిట ఉత్సవాలు నిర్వహిస్తున్నామని డిస్ట్రిక్ట్ గవర్నర్ కల్యాణ్ చక్రవర్తి అన్నారు. రోటరీ హాల్లో శుక్రవారం విద్యార్థులకు పాటల పోటీలు నిర్వహించారు. విభిన్న ప్రతిభావంతురాలు శాంతిదేవికి రూ.40 వేల విలువైన లాప్‌టాప్‌ను బహూకరించారు. మంగరాజు, కిషోర్‌రెడ్డి, పద్మావతి, టి.నాగిరెడ్డి, గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ ఒకరి మృతి

**గండేపల్లి:** చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై వై.శివనాగబాబు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలివీ.. 17న రంగంపేటకి చెందిన దివిలి చంద్రమౌళి(42) పెద్దాపురం వెళ్లి వస్తుండగా సూరంపాలెం ఆదిత్య కళాశాల వద్దకు వచ్చేసరికి అదే సమయంలో వెనుక నుంచి వచ్చిన లారీ చంద్రమౌళిని బలంగా ఢీ కొట్టింది. గాయపడ్డ ఆయనను కాకినాడ జీజీహెచ్‌కి తరలించగా శుక్రవారం మృతి చెందారు. బంధువుల ఫిర్యాదుపై కేసు నమోదు చేశారు.

## కొబ్బరి మొక్కల నరికివేతపై ఫిర్యాదు

**రౌతులపూడి:** పి.చామవరంలో తన భూమిలో ఉన్న కొబ్బరి మొక్కలను పలువురు శుక్రవారం నరికేసినట్లు జి.కోటేశ్వరరావు తెలిపారు. దౌర్జన్యానికి పాల్పడిన వారిపై చర్యలు కోరుతూ పోలీసులకు ఫిర్యాదు చేశానని ఆయన పేర్కొన్నారు.

## 150 లీటర్ల సారా స్వాధీనం..ఇద్దరి అరెస్టు

**రౌతులపూడి:** లచ్చిరెడ్డిపాలెం గ్రామశివారున అక్రమంగా సారాబట్టీ నిర్వహిస్తున్న ఇద్దరిని శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సై వెంకటేశ్వరరావు, సిబ్బంది దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి, 150 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. దేవుడు, ఏసుబాబు అనే ఇద్దరిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

### మెట్టుచింతలో బెల్లంఊట ధ్వంసం

**ప్రత్తిపాడు:** మెట్టుచింతలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు శుక్రవారం దాడులు జరిపారు. 800 లీటర్ల బెల్లంఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ శివప్రసాద్ తెలిపారు. నిందితుల కోసం గాలిస్తున్నట్లు పేర్కొన్నారు.

## అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

**గండేపల్లి:** ఎన్‌హెచ్‌పై వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 45 పశువులను పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు. వివరాలివీ.. శుక్రవారం విజయనగరం నుంచి హనుమాన్ జంక్షన్‌కు వాహనంలో 35 ఎద్దులు, 5 ఆవులు, 5 చిన్న ఆవులను పట్టుకున్నట్లు తెలిపారు. ఒకరిని అరెస్ట్ చేసి, పశువులను కృష్ణునిపాలెం గోశాలకు తరలించారు.

## తాగి వాహనాలు నడిపిన పది మందిపై కేసు

**గండేపల్లి(జగ్గంపేట):** డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ పది మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వైఆర్‌కే.శ్రీనివాస్ తెలిపారు. వివరాలివీ.. జగ్గంపేట సర్కిల్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 10 మందిని శుక్రవారం పెద్దాపురం కోర్టులో హాజరుపరిచారు. వీరిలో నలుగురికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా, మిగిలిన ఆరుగురికి రెండు రోజుల జైలుశిక్ష విధించారు.

## 12 అడుగుల కొండచిలువ హతం



**గండేపల్లి:** సుమారు 12 అడుగుల కొండచిలువను మల్లేపల్లికి చెందిన కూలీలు హతమార్చారు. వివరాల్లోకి వెళ్తే.. మల్లేపల్లి గ్రామ శివారున వరిచేలో శుక్రవారం కూలీలు పంటను కోస్తుండగా కొండచిలువ ఉండడం గమనించారు. కొండచిలువ పెద్దగా ఉండడంతో ప్రాణభయంతో దానిని హతమార్చారు.

## ఇళ్ల మధ్య మద్యం దుకాణాలొద్దు

**ఏలేశ్వరం, గండేపల్లి, న్యూస్‌టుడే :** మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ జిల్లా కన్వీనర్ ఎన్.సూర్యనారాయణ శుక్రవారం ఏలేశ్వరంలో పర్యటించారు. పట్టణంలోని 12 వ వార్డులో ఇళ్ల మధ్య మద్యం దుకాణం ఏర్పాటు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ మహిళలు నిర్వహిస్తున్న పోరాటానికి ఆయన మద్దతు తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. మహిళల డిమాండ్ మేరకు మద్యం షాపు ఇక్కడ నుంచి వేరే ప్రాంతానికి తరలించాలన్నారు. జామి ఆదినారాయణ, కె.సింహాచలం, ధనలక్ష్మి, సిరిపురపు కుమారి, కృపావతి తదితరులు పాల్గొన్నారు.

● నీలాద్రిరావుపేట గ్రామాన్ని అనుకుని ఉన్న రాంభద్రయ్య చెరువు పక్కన, జాతీయ రహదారిని అనుకుని నూతన మద్యం దుకాణం ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయని గ్రామస్థులు పేర్కొన్నారు. శుక్రవారం ఈ విషయమై సర్పంచి సురేష్, ఎంపీడీవో నాతి బుజ్జికి, తహసీల్దారు శ్రీనివాస్, ఏఎస్సై శేఖర్‌కు గ్రామస్థులు వినతిపత్రాలు అందజేశారు.



ఏలేశ్వరంలో మద్యపాన వ్యతిరేక కమిటీ నాయకుల నిరసన

## రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులు

**రౌతులపూడి:** జడ్పీ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. బల్లాడి రోహిత్ రోషన్ (పదో తరగతి) లాంగ్ జంప్‌లో ప్రథమ, డిస్కస్ త్రోలో ద్వితీయ స్థానం, పైలా శ్రీనివాస్ (తొమ్మిదో తరగతి) షాట్‌పుట్‌లో ద్వితీయ స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని హెచ్ఎం రాంబాబు తెలిపారు.

## డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌గా చెన్నారావు

**గండేపల్లి(జగ్గంపేట):** జగ్గంపేట డిగ్రీ కళాశాల నూతన ప్రిన్సిపల్‌గా దేవరపల్లి చెన్నారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ.. ఏలేశ్వరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పనిచేసి, బదిలీపై ఇక్కడకు వచ్చినట్లు తెలిపారు.

# ఊరంతా దీపావళి

### ● ఉచిత సిలిండర్లతో వంటింట్లో వెలుగులు

న్యూస్‌టుడే - తుని, తుని పట్టణం

ఎప్పుడెప్పుడా అని మహిళామణులు ఎదురు చూస్తూ వచ్చిన తరుణం రానే వచ్చింది. కూటమి ప్రభుత్వం దీపావళి నుంచి ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం అమలు చేస్తున్నట్లు ప్రకటించడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. సిలిండర్ తీసుకున్న 48 గంటల్లోనే లబ్ధిదారుల ఖాతాల్లో సొమ్ము జమ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

### మూడు నియోజకవర్గాల్లో ఇలా...

హెచ్‌పీ, భారత్, ఇండేన్ గ్యాస్ సంస్థలకు చెందిన 16 ఏజెన్సీలు ఉన్నాయి. వీటిలో తుని నియోజకవర్గానికి చెందిన 1,24,440, ప్రత్తిపాడు నియోజకవర్గంలో 64,562, జగ్గంపేట నియోజకవర్గంలో 38,562 కనెక్షన్లు ఉన్నాయి. ఇతర ఏజెన్సీలవి మరో 30 వేలకు పైగా కనెక్షన్లు ఉన్నాయి. ఇలా మొత్తం సుమారు 2.60 లక్షల గ్యాస్ కనెక్షన్లు వినియోగంలో ఉన్నాయి. మరో 38 వేల కనెక్షన్లు వినియోగంలోలేవు. కనెక్షన్లలో సాధారణ, దీపం, ఉజ్వల్ పథకాల్లోనివి అనేకం ఉన్నాయి.

### ఏళ్లుగా ఒకే పేరుతో కనెక్షన్లు

దశాబ్దాలుగా గ్యాస్ కనెక్షన్లు పొందిన వారిలో అనేక మంది చనిపోయారు. అయినా వారి కుటుంబీకులు అదే పేరుతో కనెక్షన్లను కొనసాగిస్తున్నారు. మృతుల్లో అనేక మంది బ్యాంకు ఖాతాలను వారసులు, అధికారులు మూసేశారు. తాజాగా ప్రభుత్వం ఈ పథకంలో తొలుత లబ్ధిదారు డబ్బులిచ్చి సిలిండర్ విడిపించుకుంటే, 48 గంటల్లో బ్యాంకు ఖాతాల్లో జమచేస్తామని ప్రకటించడంతో మనుగడలో లేకుండా పోయిన ఖాతాలకు సంబంధించిన వారు ఆందోళన చెందుతున్నారు. దీనిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**పేదలకు మేలు జరుగుతుంది**



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొన్ని నెలల్లోనే ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం దీపావళి నుంచి ప్రారంభిస్తుండటం ఆనందంగా ఉంది. ప్రభుత్వం ఉచితంగా సిలిండర్లు ఇవ్వడంతో పేదలకు ఎంతో మేలు జరుగుతుంది.

- ఎస్.చంద్రకళ, రామకృష్ణాకాలనీ, తుని